సంచిక 2 – జూన్ 2015

# LEISA INDIA

# లీసా ఇండియా

తెలుగు ప్రత్యేక ప్రచురణ

***Magazine on Low External Input Sustainable Agriculture***
***Compilation of Selected translated articles into Telugu***

తక్కువ బాహ్య ఉత్పాదకాలను ఉపయోగించి చేసే సుస్థిర వ్యవసాయ పత్రిక
తెలుగులోకి అనువదించిన కొన్ని వ్యాసాల సంకలనం



# లీసా ఇండియా

**సంచిక 2, జూన్ 2015**

ఈ సంచికలో వ్యాసాలు లీసా ఇండియా పత్రికలో ప్రచురితమైన ఆంగ్ల వ్యాసాల నుండి ఎంపిక చేయబడ్డవి.



**ఎ.యమ్.ఇ. ఫౌండేషన్**

నం. 204, 100 ఫీట్ రింగ్ రోడ్, మూడవ స్టేజ్,
రెండవ ఫేస్, బనశంకరి, బెంగళూరు – 560085
ఫోన్ : +91 080 26699512
+91 080 26699522
ఫ్యాక్స్ : +91 080 26699410
email: amebang@giasbg01.vsnl.net.in



**లీసా ఇండియా** ఆంగ్లంలో లీసా ఇండియా పత్రికను ఎ.యమ్.ఇ. ఫౌండేషన్ వారు ఇలియా వారి సహకారంతో ప్రచురించుచున్నారు.

**చీఫ్ ఎడిటర్** కె.వి.యస్. ప్రసాద్

**మేనేజింగ్ ఎడిటర్** టి.యమ్. రాధ

**అనువాదం** సుగుణశ్రీ మద్దాల

**అనువాద సమన్వయం** పూర్ణిమ

**అడ్మినిస్ట్రేషన్** రుక్మిణి జి. జి.

**డిజైన్ లేఔట్** శ్రీ సాయి క్రియేటివ్ డిజైనర్స్, హైదరాబాద్

**ముద్రణ** స్పాన్ ప్రింట్, బెంగళూరు

**కవర్ ఫోటో** ఇంటి వాడకం కోసం సజ్జ పంటను పండిస్తున్న బీజాపూర్ రైతు

**ఫోటో** ఎ.యమ్.ఇ.ఎఫ్

**లీసా మేగజైన్**
**ఇతర ఎడిషన్లు**
లాటిన్ అమెరికన్, వెస్ట్ ఆఫ్రికన్,
బ్రెజిలియన్ మరియు చైనీస్ ఎడిషన్

**లీసా ఇండియా మేగజైన్**
**ఇతర ప్రాంతీయ ఎడిషన్లు**
హిందీ, ఒరియా, తమిళ్, కన్నడ, మరాఠీ, పంజాబీ



ఈ పత్రిక నందలి అంశములు సాధ్యమైనంత ఖచ్చితత్వాన్ని కలిగి వుండుటకు ఎడిటర్లు అన్ని జాగ్రత్తలను తీసుకోవడం జరిగినది. వ్యక్తిగతంగా వ్రాసిన ఆర్టికల్స్‌కు ఆ రచయితలే బాధ్యత వహించెదరు.

ఈ పత్రికలోని వ్యాసాలను ఫోటోకాపి తీసి మిగతా వారికి ఇవ్వడాన్ని ఎడిటర్స్ ప్రోత్సహిస్తారు.



మిసెరియార్ వారి తోడ్పాటుతో ఎ.యమ్.ఇ.ఎఫ్. వారిచే ప్రచురితం


## లీసా LEISA www.leisaindia.org

లీసా అంటే తక్కువ బాహ్య ఉత్పాదకాలను ఉపయోగించి చేసేటటువంటి సుస్థిర వ్యవసాయం. ఇది సామాజిక మరియు సాంకేతిక పరమైన విషయాలను జోడించి రైతులు పర్యావరణాన్ని పరిరక్షిస్తూ తమ యొక్క ఉత్పాదకత మరియు ఆదాయాన్ని పెంచుకొనుట గురించి పనిచేస్తుంది. లీసా అనునది స్థానిక వనరులను మరియు సహజ ప్రక్రియలను సరియగు విధంగా ఉపయోగిస్తూ అవసరమైతేనే బాహ్య ఉత్పాదకాలు (ఇన్‌పుట్స్) ఉపయోగించుకొనుట గురించి తెలియజేస్తుంది. ఇది స్త్రీ, పురుష రైతులు వారి విజ్ఞానం, నైపుణ్యం, విలువలు, సంస్కృతి మరియు సంస్థల ఆధారంగా సాధికారతను సాధించి భవిష్యత్తును నిర్మించుకొనుట కొరకు ఉపయోగపడుతుంది. అంతేకాక భాగస్వామ్య పద్ధతుల ద్వారా రైతుల మరియు ఇతరుల యొక్క సామర్ధ్యాలను పెంపొందించి, మారుతున్న అవసరాలు మరియు పరిస్థితులకనుగుణంగా వ్యవసాయ వృద్ధిని సాధించుట లీసా లక్ష్యం. సాంప్రదాయ మరియు శాస్త్రీయ విజ్ఞాన పద్ధతులను జోడించి విధాన పరమైన నిర్ణయాలను ప్రభావితం చేసి తదుపరి అభివృద్ధికి సరియైన బాటను పరచటం లీసా యొక్క ప్రధాన ఉద్దేశ్యం. లీసా అనునది ఒక భావన, ఒక విధానం మరియు ఒక రాజకీయ సందేశం.

## ఎ.యమ్.ఇ. ఫౌండేషన్ AMEF www.amefound.org

ఎ.యమ్.ఇ. ఫౌండేషన్ దక్కన్ పీఠభూమిలోని చిన్న, సన్నకారు రైతులతో కలిసి ప్రత్యామ్నాయ సాగు పద్ధతులను రూపొందించి, విజ్ఞానాన్ని పెంపొందించి, శిక్షణను అందించి, వివిధ అభివృద్ధి సంస్థలను అనుసంధానించి అనుభవాలను పంచుకుంటుంది.


ధర్మకర్తలు
చైర్మన్ : శ్రీ చిరంజీవ్ సింగ్, ఐ.ఎ.ఎస్
సభ్యులు : డా. ఆర్. ద్వారకీనాథ్ , డా. విఠల్ రాజన్,
డా. ఎన్. జి. హెగ్డే, ప్రొ॥ వి. వీరభద్రయ్య,
డా. ఎం. మహదేవప్ప, డా. టి.ఎం. త్యాగరాజన్,
డా. ఎ. రాజన్న
కోశాధికారి : శ్రీ బి.కె. శివరాం
ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ : శ్రీ కె.వి.ఎస్. ప్రసాద్


## మిసెరియార్ MISEREOR www.misereor.org

మిసెరియార్, అభివృద్ధి సహకారానికై 1958లో స్థాపించబడిన జర్మన్ కాథోలిక్ బిషప్పుల సంస్థ. ఈ సంస్థ 50 ఏళ్ళకు పైగా ఆఫ్రికా, ఆసియా మరియు లాటిన్ అమెరికా దేశాలలో దారిద్ర్య నిర్మూలనకు కృషి చేస్తూ ఉన్నది. జాతి, మత, లింగ భేదాలతో నిమిత్తం లేకుండా, అవసరంలో ఉన్న ఏ మనిషికైనా మిసెరియార్ సంస్థ తోడ్పాటు లభిస్తుంది.

పేద ప్రజలు, ప్రతికూల పరిస్థితులలో ఉన్నవారు స్వయంగా చేపట్టే ప్రయత్నాలకు మిసెరియార్ సహాయపడుతుంది. మిసెరియార్ స్థానిక సంస్థలతో - చర్చికి సంబంధించిన సంస్థలతో, ప్రభుత్వేతర సంస్థలతో, సామాజిక ఉద్యమాలతో మరియు పరిశోధనా సంస్థలతో కలిసి పనిచేస్తుంది. లబ్ధిదారులతో కలిసి ఈ భాగస్వామ్య సంస్థలు స్థానిక అభివృద్ధి విధానాల రూపకల్పనకు, ప్రాజెక్టుల అమలుకు తోడ్పడతాయి. ఈ విధంగా మిసెరియార్ సంస్థ, తన భాగస్వామ్య సంస్థలతో కలిసి నిరంతరం మారుతున్న సవాళ్ళకు ప్రతిస్పందిస్తుంది.

ప్రియ పాఠకులారా,

ఈ జూన్ **2015** సంచికను మీతో పంచుకోవడం మాకు ఎంతో ఆనందంగా ఉంది.

జీవవైవిధ్యం జాతీయ వారసత్వసంపద. అంతరించిపోతున్న జీవనోపాధులను, జీవావరణాలను కాపాడగలిగేది ఈ జీవవైవిధ్యమే. ఒరిస్సా, ఆంధ్రా రాష్ట్రాలలోని స్థానిక ప్రజలు వారి పంట వ్యవస్థలలో చిరుధాన్యాలను చేర్చుకోవడం ద్వారా జీవవైవిధ్యాన్ని ఎలా పటిష్టం చేసుకున్నారన్నది ఈ సంచికలోని వ్యాసాలు వివరిస్తాయి. వారు ఇప్పుడు వాతావరణంలో వచ్చే విపరీత మార్పులను తట్టుకోగల పర్యావరణహితమైన, సేద్య విధానాన్ని అవలంభిస్తూ మరింత వైవిధ్యభరితమైన, మరింత బలవర్ధకమైన ఆహారాన్ని అధిక పరిమాణంలో పండిస్తున్నాను.

పర్యావరణహితమైన వ్యవసాయాన్ని చేపట్టడంలో మహిళల పాత్ర మరియు వారి సంఘటిత శక్తిని కూడా ఈ సంచిక వివరిస్తుంది. సుస్థిరమైన వ్యవసాయ పద్ధతులను పాటించడం ద్వారా కుటుంబస్థాయిలో ఆహార భద్రత ఎలా సమకూర్చుకోవాలన్నది ఆంధ్రప్రదేశ్ మరియు కేరళకు చెందిన రెండు కార్యక్రమాలు చూపించాయి. ఒరిస్సాలోని ఏడు గ్రామాలకు చెందిన మహిళా బృందాలు తమ సంఘటిత చొరవల ద్వారా అటవీ మరియు తీరప్రాంత జీవవైవిధ్యాన్ని పరిరక్షించారు.

ఈ సంచిక చదవడం మీకు నచ్చుతుందని భావిస్తున్నాము. ఈ వ్యాసాలపై మీ అమూల్యమైన అభిప్రాయాలను మాకు తెలియచేయగలరు. మీ అభిప్రాయాలను, ఆలోచనలను మా వెబ్‌సైట్ మీద కానీ, పోస్టు లేదా ఈ–మెయిల్ (leisaindia@yahoo.co.in) ద్వారా కానీ పంచుకోగలరు. మీ రైతుమిత్రులు ఎవరైనా ఈ పత్రికను చదవాలని మీరనుకుంటే, వారి పూర్తి తపాలా చిరునామా మాకు పంపిస్తే, మేము వారికి ఈ పత్రికను పంపడానికి సంతోషిస్తాము.

సంపాదకులు



జీవవైవిధ్య సాగుబడి ................................................పి.వి. సతీష్

భారతదేశంలోని దక్కను ప్రాంతంలో **60,000**లకు పైగా మహిళా రైతులు జీవవైవిధ్య సేద్య పద్ధతుల ద్వారా వారి కుటుంబాలను, వారి సంస్కృతిని మరియు వారి ఆత్మగౌరవాన్ని పోషిస్తున్నారు. వారి పరిజ్ఞానం మరియు విజయాలు జాతీయ, సంస్థాగత పరిధులు ...

**4**



ఆహార ఆధిపత్య దిశలో ..................................ప్రశాంత్ మొహంతి

చిరుధాన్యాలు ఎంతో పుష్టికరమైన ఆహార పంటలు. ఇవి చాలా దృఢమైన పంటలు కాబట్టి ఈ పంటలు వాతావరణ మార్పులను తట్టుకుని నిలబడే గుణం కలిగిఉంటాయి. దురదృష్టవశాత్తూ, ఎక్కువ పెట్టుబడి పెట్టి చేసే ఏకపంట విధానాల వలన కొన్ని సంవత్సరాలుగా, ఈ పంటల కింద ఉన్న భూవిస్తీర్ణం తగ్గిపోతూ వస్తోంది. కంధమల్ ప్రాంతపు గిరిజన ప్రజలు ...

**8**

దారిద్ర్యం నుండి బయటపడుతున్న మహిళలు.......................................................... లాండేసా

మహిళా సాధికారత మరియు గ్రామీణ జీవనోపాధుల విషయంలో పెద్ద ఎత్తున విజయాన్ని సాధించిన కార్యక్రమాలు రెండు – కేరళ రాష్ట్రంలోని కుడుంబశ్రీ (కె.డి.ఎస్.) పథకం మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఇందిరా క్రాంతి పథకం (ఐ.కె.పి.). యు.ఎస్.విమెన్ అప్పగిస్తే, లాండెసా సంస్థ చేపట్టిన ఒక అధ్యయనం ద్వారా, మహిళలకు సాధికారత కల్పించగల వ్యవస్థలను మరియు ....


**11**



ఘనమైన అటవీ ఆహార వైవిధ్యం............................... భరత్ మన్సత

మన భూగోళం ఒక అత్యంత కీలకమైన సంధి కాలపు అంచున ఉంది. నిర్దాక్షిణ్యంగా శిలాజ వనరులను కొల్లగొట్టిన శకం ముగిసి, మన జీవ సంపదను పునరుద్ధరించుకునే శకానికీ, వనరులను పెంచి పోషించుకునే సంస్కృతికీ దారి ఇవ్వాలి.

**16**



హద్దులుదాటి ముందుకు వెళ్ళడం........................... ఆనీ బెర్గ్ మాన్

భారతదేశపు వాయువ్య ప్రాంతంలోని మహిళలు కూటమిగా ఏర్పడి తమని, తమ కుమార్తెలను దారిద్ర్యం నుండి కాపాడుకుంటున్నారు. వారి మీద వారికి నమ్మకం కుదరడంతో వారు వారి తోటి మహిళలకు కూడా దారి చూపించడానికి సిద్ధంగా ఉన్నారు.

**18**



తన జీవవైవిధ్య తోటలోని ఎర్ర గోంగూరతో హోతి బి.రాజమ్మ

# జీవవైవిధ్య సాగుబడి

**పి.వి. సతీష్**

**భారతదేశంలోని దక్కను ప్రాంతంలో 60,000లకు పైగా మహిళా రైతులు జీవవైవిధ్య సేద్య పద్ధతుల ద్వారా వారి కుటుంబాలను, వారి సంస్కృతిని మరియు వారి ఆత్మగౌరవాన్ని పోషిస్తున్నారు. వారి పరిజ్ఞానం మరియు విజయాలు జాతీయ, సంస్థాగత పరిధులు దాటి వారికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిపెట్టాయి.**

అది 2003 సంవత్సరం! ఆంధ్రప్రదేశ్ (ఇప్పుడు తెలంగాణ) లోని దిడ్గి గ్రామంలో, రెల్లు కప్పు ఉన్న గదిలో 50 మంది దాకా పేద రైతు మహిళలు గుమిగూడి ఉన్నారు. వీరంతా వీడియో ద్వారా అనుభవజ్ఞులైన వ్యవసాయ శాస్త్రజ్ఞుల బృందంతో మాట్లాడుతున్నారు. మూడు ఎకరాల మెట్ట భూమిలో 18 రకాలకు పైగా పంటలు పండిస్తున్న సమ్మమ్మ నిలబడి తాను చేపడుతున్న వ్యవసాయ విధానంలో జీవవైవిధ్యం యొక్క ప్రాముఖ్యత ఏమిటో వివరిస్తోంది. అంతలోనే అటువైపునుండి ఒక శాస్త్రజ్ఞుడు అడ్డుకుని, ''అలా కాదమ్మా. జీవవైవిధ్యం గురించి ఆలోచించడానికి మా శాస్త్రజ్ఞులంతా ఉన్నాము. మీరు ఏ విత్తనం వాడుకోవాలి అన్నది మేము చెబుతాము కదా'', అన్నాడు.

ఇప్పటికీ, చాలామంది శాస్త్రజ్ఞులు వ్యవసాయ శాస్త్రం మరియు వ్యవసాయ పరిజ్ఞానం పైన ఆధిపత్యం కేవలం తమకే ఉందని భావిస్తున్నారు. అందువలన వ్యవసాయానికి సంబంధించిన అంశాలు చర్చించేటప్పుడు, వీరు పేద రైతులను, అందునా మహిళలను అస్సలు చేర్చుకోరు. అయితే, వారి అభిప్రాయం తప్పని దక్కను పీఠభూమి ప్రాంతపు మహిళలు అనేక విషయాలలో రుజువు చేశారు.

## జీవవైవిధ్య పంట వ్యవస్థలు

దిడ్గి గ్రామంలోని నిరుపేద రైతు మహిళలు అధిక వైవిధ్యంకల వ్యవసాయ వ్యవస్థలను రూపొందించారు. వీటి యొక్క ముఖ్య లక్షణాలు : ఇవన్నీ నీటిపారుదల లేని, అంతగా సారవంతము కాని రెండు ఎకరాల లోపు భూములు; ఈ రైతులంతా రసాయనాలు వాడరు; తమ చిన్న చిన్న భూములలోనే వీరంతా 12-13 రకాల పంటలను పండిస్తారు; మరియు వీరెవ్వరికీ కూడా వారికి అవసరమైన ఏ ఒక్క ఆహార వస్తువూ మార్కెట్ నుండి కొనుగోలు చేసే అవసరం లేదు.

దక్కన్ ప్రాంతపు మహిళలు విత్తనం మీద పెత్తనం కలవారు. వారు కేవలం విత్తనాలను పరిరక్షించడమేకాక, పంట విత్తే సమయంలో ఏ ఏ రకాల విత్తనాలు, ఎంతెంత మోతాదులో విత్తుకోవాలి వంటి ముఖ్యమైన నిర్ణయాలు కూడా తీసుకుంటారు. ఇది ఒకరకమైన పరస్పర ప్రయోజనకర పద్ధతి: అంటే, మహిళలు చేపట్టే సేద్య విధానం జీవవైవిధ్యాన్ని కాపాడుతుంది, జీవవైవిధ్యం వారి వ్యవసాయ విధానాన్ని కాపాడుతుంది.

అయితే ఈ మహిళలకు జీవవైవిధ్యం ఎందుకు అంత ప్రధానమైనది? వ్యవసాయ శాఖ వారు సూచించిన విధంగా వారు ఒకటి, రెండు వాణిజ్య పంటల్తో ఎందుకు తృప్తి పడలేదు? వీరు పచ్చ జొన్న వంటి ఆహార ప్రధాన పంటల పట్ల మొగ్గు చూపిస్తారు. కానీ, మార్కెట్‌లో ఈ పచ్చ జొన్న ఎక్కువ ధర పలుకకపోవడం వలన వ్యవసాయ శాస్త్రజ్ఞులు ఈ రకాలను పూర్తిగా పక్కకు పెట్టేశారు. కానీ ఈ దళిత మహిళలకు పచ్చ జొన్న అంటే పౌష్టికాహారం, మంచి పశుగ్రాసం, మెట్టభూముల్లో పెరిగే పంట, కంచెకు మరియు పైకప్పుకి ఉపయోగపడడమే కాక ఇంకా ఎన్నో సుగుణాలు కలిగి ఉంది. అంతేకాక, ఈ అంశాలన్నీ కూడా వారి ఆధీనంలో ఉంటాయి, వారి ఆదాయం ఎంత తక్కువగా ఉన్నప్పటికీ కూడా. ఈ ''అనాథ పంటల'' పట్ల వారు చూపించే గౌరవమే వారికి ఆహారం పట్ల, వ్యవసాయం పట్ల ఉన్న ప్రత్యేకమైన దృష్టిని తెలియచేస్తుంది.

## ఆహారం కంటే ఎక్కువ

ముఖ్యంగా, ఈ నిరుపేద మహిళలు వారి సాంప్రదాయ వ్యవసాయ విలువలకి, వారు చేసే వ్యవసాయంలో జీవవైవిధ్యానికీ కట్టుబడి ఉండడం వలన వారి జీవితాలలో చాలా పెద్ద ప్రయోజనమే చేకూర్చింది. అది వారిని చావు నుండి కాపాడి బ్రతుకుని ఇచ్చింది. ఎందుకంటే ఎక్కువ పెట్టుబడి పెట్టి, నష్టాలు కలిగే ఆస్కారం ఎక్కువ ఉన్న, అమ్మకానికై ఉద్దేశించి, రసాయనాలు ఉపయోగించి చేసే సాగు పద్ధతులను అవలంభించిన భారత దేశంలోని ఇతర రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు కొనితెచ్చుకున్నారు. తక్కువ ఖర్చుతో జీవవైవిధ్య సూత్రాలను అనుసరించి వ్యవసాయం కొనసాగించిన నిరుపేద మహిళా రైతులలో ఒక్క ఆత్మహత్య కూడా కనిపించలేదు. వ్యవసాయ జీవవైవిధ్యం వీరి సాంప్రదాయంలో అతి ముఖ్యమైన భాగమే కాకుండా, అసలు వీరు సేద్యం చెయ్యడానికి అనువైన ఒకే ఒక మార్గం కూడా. వాతావరణపరమైన ఆటుపోట్లనుండి వారిని వారు కాపాడుకోవడానికి ఉన్న ఉత్తమమైన భద్రత ఏర్పాటు జీవవైవిధ్య భరిత వ్యవసాయ విధానమే అని వారికి స్పష్టంగా తెలుసు. అంతేకాక, వీరు పండించే పంటలు వారి ఆహార సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. వంటింటిలో వండే ఆహార పదార్థాల బంధమే వీరి పొలాల్లో పంటల మధ్య బంధంగా ప్రతిఫలిస్తుంది. ఉదాహరణకి జొన్నలతో తయారుచేసిన ఆహారానికి కందులతో చేసిన ఆహారంతోడౌతుంది. అందువలన పొలంలో జొన్న పంటకు జతగా కందిని పెంచడం జరుగుతుంది. అనేక శతాబ్దాలుగా వారి పొలాలలో వ్యవసాయ జీవవైవిధ్యం

> పాతకాలపు విలువలకు, జీవవైవిధ్యానికీ కట్టుబడి ఉండడం వలన అత్యంత నిరుపేదలైన ఈ మహిళలు ఎంతో మేలు పొందారు. అది వారిని చావు నుండి కాపాడి, వారికి బ్రతుకును ఇచ్చింది.

### ఆహార విధానాన్ని తిరగరాయడం

భారతదేశంలో, ప్రభుత్వరంగ సంస్థలు ఏవో కొన్ని జాతుల మొక్కలనే ఆహార పంటలుగా ప్రోత్సహించి, తోడ్పాటు అందిస్తున్నాయి. అనాదిగా గ్రామీణ ప్రజలకు పౌష్టి కాహారాన్ని అందించిన ఎన్నో రకాల చిరుధాన్యాలు వీటిలో లేవు. మొట్టమొదటిసారి, 2013లో, మన ప్రభుత్వం చిరుధాన్యాలను ఈ దేశపు ఆహార భద్రతా ధాన్యంగా గుర్తించి వాటిని సరికొత్త జాతీయ ఆహార భద్రతా చట్టంలో చేర్చుకుంది. దళిత రైతు మహిళలు, దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ మరియు మిల్లెట్ నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా అన్న సంస్థలు ఒక దశాబ్దానికి పైగా పాటుపడితే ఇప్పుడు చిరుధాన్యాలు భారతదేశ ప్రభుత్వ ఆహార వ్యవస్థలో స్థిరపడ్డాయి. ఇది కేవలం మాకే కాదు, ఈ మహిళలకు కూడా ఇది ఎంతో ఆనందించవలసిన సమయం. వారి కష్టాలను మరియు విజయాలను నలుగురితో పంచుకోవడం కోసం వారు రేడియో కార్యక్రమాలను నిర్వహించారు. కొన్ని షార్ట్ ఫిలింస్ (తక్కువ నిడివి చిత్రాలు) కూడా తీసారు. వారి సామాజిక, ఆర్థిక, లింగపరమైన వెనుకబాటుతనాన్ని వారు ధైర్యంతో, పట్టుదలతో అధిగమించి, జాతీయ విధానాన్నే తిరగరాసారు. 2013లోనే, చిరుధాన్యాల గురించిన సందేశాన్ని వాటికి పుట్టినిల్లు అయిన ఆఫ్రికా ఖండానికి తీసుకువెళ్ళడం కూడా జరిగింది. ఆఫ్రికా-ఇండియా మిల్లెట్ నెట్‌వర్క్ మొదలుపెట్టడంతో ఇరు ఖండాల మధ్యనా ఒక కొత్త సంఘీభావం ఏర్పడింది.



*విత్తనాల ఎంపికకు బసంత్‌పూర్ నర్సమ్మ వంటి స్త్రీలకు ఉన్నలాంటి గొప్ప పరిజ్ఞానం కావాలి*

కలకలలాడుతోందంటే కారణం, సాటిలేని ఈ మేటి 'ఫార్మ్-టు-కిచెన్' (పొలం - నుండి - వంటింటికి) అన్న నమూనాయే! ఈ ఆహారపు సాంప్రదాయాన్ని కాపాడుకుంటూ వస్తున్నది ముఖ్యంగా మహిళలే కాబట్టి, ఈ వ్యవసాయ జీవవైవిధ్య సాంప్రదాయానికి కూడా వారసులు వీరే.

ఈ జీవవైవిధ్య క్షేత్రాలు కేవలం భౌతికపరమైన జీవనాన్ని పోషించడంతోబాటు, నైతిక, జీవావరణ మరియు ఆధ్యాత్మిక పరమైన జీవనాన్ని కూడా పెంపొందిస్తాయి. ఈ ప్రాంతపు ప్రజలు జీవవైవిధ్యాన్ని అనేక మత సంబంధిత పండుగల రూపంలో ఉత్సవంలా జరుపుకుంటారు. ఈ పండుగలలో దేవుళ్ళు జీవవైవిధ్యానికి చిహ్నాలు (గుర్తు)గా నిలిచి జీవవైవిధ్యాన్ని దీవిస్తారు. ఉదాహరణకి ఎంగలగట్టే పున్నమి పండుగను శీతాకాలపు పంట చేతికి వచ్చినప్పుడు, వివిధరకాల పంటలను అందరి ఇళ్ళల్లో గుమ్మాలకి వేలాడతీసి జరుపుకుంటారు. ఇది ఎలా ఉంటుందంటే ''ఇదిగో చూడండి మా పొలంలో ఎన్ని రకాల పంటలు ఉన్నాయో!'' అన్నట్టుగా ఉంటుంది. మహిళలు ఈ పంటలను డబ్బు కన్నా ముఖ్యమైన సంపదగా భావిస్తారు. ఫలితంగా ఈ విత్తనాలు అమ్మడం కానీ, కొనడం కానీ ఉండదు. అవి ఎప్పుడూ ఒకరికి ఒకరు ఇచ్చిపుచ్చుకుంటారు.

## పరిజ్ఞానాన్ని గర్వంగా పంచుకోవడం

దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డి.డి.ఎస్.) అన్న ఒక ప్రభుత్వేతర సంస్థ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ఈ దళిత రైతులతో కలిసి పనిచేస్తూ, గత పాతికేళ్ళుగా ఈ రైతుల యొక్క పరిజ్ఞానం అందరితో పంచుకోవడంలో వీరికి తోడ్పడింది. ఈ ప్రాంతంలోని మహిళలు, ముఖ్యంగా అట్టడుగు సామాజిక-ఆర్థిక వర్గాలకు చెందినవారు, వ్యవసాయంలో వారి అనుభవాలను, వ్యవసాయం పట్ల వారి దృక్పథాన్నీ ఇతర రైతులతో, శాస్త్రజ్ఞులతో, విధానకర్తలతో పంచుకుందుకు కనీసం 100 సార్లు ప్రయాణం చేసారు, పెరు మరియు కంబోడియా వంటి దేశాలతో కలిపి. అంతర్జాతీయ సదస్సులలోను, రైతూలలో మహిళలూ, పురుషులూ కూడా వీరి ఉపన్యాసాలను స్వాగతించారు. 2003లో, కెనడా దేశంలోని విక్టోరియా నగరంలో అంతర్జాతీయ సేంద్రీయ సభలో వీరు మాట్లాడినప్పుడు సభలోని వారందరూ వీరి అనుభవాలు తెలుసుకుని ముచ్చటపడ్డారు.

1998 మొదలుకుని, ప్రతి సంవత్సరం వీరు ఒక నెలంతా, జీవావరణహిత వ్యవసాయం, విత్తనాలు మరియు సేంద్రీయ మార్కెట్లపై ఆధిపత్యం వంటి అంశాలను గురించి చాటి చెబుతూ, చర్చిస్తూ 50కి పైగా గ్రామాలలో పర్యటిస్తూ ఈ పండుగ జరుపుకోవడం మొదలుపెట్టారు. ఈ పండుగ ద్వారా వీరు రైతులకు మట్టి, వ్యవసాయం మరియు పర్యావరణం మధ్యగల అవినాభావ సంబంధాలను స్పష్టంగా తెలియచెప్పడం జరుగుతుంది. వారు ఆ ప్రాంతంలోని 1,50,000 మంది రైతులను కలిసి, వారి ప్రాంతంలోని సాంప్రదాయ విత్తనాల, పంటల సంపదను

చూపించారు. ఈ అంశానికి సంబంధించిన సామూహిక సాంస్కృతిక ప్రచారాలలో ఈ జీవవైవిధ్య యాత్రలు ఎంతో ముఖ్యమైనవిగా భారతదేశ ప్రభుత్వం గుర్తించింది.

## ప్రపంచవ్యాప్త గుర్తింపు

2003లో శాస్త్రజ్ఞులు తేలికగా తీసిపారేసిన ఈ దక్కను ప్రాంతపు మహిళా రైతులు, ఇప్పుడు జీవవైవిధ్యంలో వారు చేసిన కృషికి, జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో ఎంతో గుర్తింపు తెచ్చుకుంటున్నారు. ఉదాహరణకి, 55 యేళ్ళ అంజమ్మ ఎన్నడూ పాఠశాలకు వెళ్ళని, చదవడమూ, రాయడమూ రాని ఒక వృద్ధ రైతు మహిళ. ఆమె ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ-జీవవైవిధ్య నిపుణుల సంఘంలో సభ్యురాలు. ప్రభుత్వాధికారులు, శాస్త్రజ్ఞులు, ప్రభుత్వేతర సంఘాలకు చెందిన క్రియాశీలక సభ్యులు మరియు మీడియా ప్రతినిధులు తరచూ ఈ మహిళల పొలాలను, విత్తనాలను చూడడానికి వస్తూ ఉంటారు. వార్తాపత్రికలలో మరియు టి.వీ. చానళ్ళలో వీరి గురించిన సమాచారం క్రమం తప్పక ప్రసారం అవుతూ ఉంటుంది.

ఈనాడు, దాదాపు 50,000 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న ఈ భూమిని భారత జాతీయ జీవవైవిధ్య బోర్డు (ఇండియన్ నేషనల్ బయోడైవర్సిటీ బోర్డ్) వ్యవసాయ జీవవైవిధ్య వారసత్వ స్థానం (అగ్రికల్చరల్ బయోడైవర్సిటీ హెరిటేజ్ సైట్)గా గుర్తించింది. దేశంలోనే ఇది మొట్టమొదటిది. ది ఇంటర్నేషనల్ కన్వెన్షన్ ఆన్ బయొలాజికల్ డైవెర్సిటీ (సి.బి.డి. - అంతర్జాతీయ జీవవైవిధ్య కూటమి) అన్న సంస్థ ఏ ఏ ప్రదేశాలలో జీవవైవిధ్యం ఆదరించబడి, ఆచరింపబడుతోందో ఆయా స్థలాలను గౌరవించాలని అనుకుంది. ఇటువంటి వారసత్వ ముద్ర (హెరిటేజ్ లేబుల్) ఇవ్వడం వలన ఈ భూమి, జాతీయ పార్కులకు సరిసమానమైన హోదా కలిగి ఉండి, ఆ ప్రాంతపు రైతులకు, సమూహాలకు ప్రత్యేక అంతస్తు, హక్కులు మరియు ప్రోత్సాహకాలు అందుతాయి. ఇటువంటి హోదా కల్పించడం వలన, భారతదేశం నిరుపేద కుటుంబ రైతులను, జీవవైవిధ్య పరిరక్షణలో వారు చేస్తున్న కృషినీ గుర్తిస్తోంది అన్న విషయం స్పష్టంగా తెలుస్తుంది. ఈ వారసత్వ హోదా పట్ల మీ స్పందన ఏమిటి అని అడిగితే, మొహబ్బత్‌పూర్ స్వరూప అనే రైతు మహిళ, ''మాకు డబ్బులూ అవీ ఏమీ వద్దు కానీ. మాకు ఆ గుర్తింపు ఉంటే చాలు'', అంటుంది.

## మహిళా శక్తి

వారి పొలాలు, మరియు వారి దృక్పథాల పట్ల పెరిగిన ఆసక్తి కారణంగా ఈ మహిళలకు తమ మీద తమకి నమ్మకం చాలా పెరిగింది. ఒకసారి కొంతమంది ప్రభుత్వాధికారులు తనను చూడడానికి వచ్చినప్పుడు, పరమ్మ అనే విత్తనాలు సంరక్షించే రైతు మహిళ వారిని ఎదుర్కోవడమే ఇందుకు నిదర్శనం. ''ప్రతి నెలా మీకు జీతాలు వస్తాయి. మీరు మీ జేబులు కరెన్సీ నోట్లతో నింపుకుంటారు, కానీ మీరు నా ఇంటికి వచ్చినప్పుడు నేను మీ జేబులు విత్తనాలతో నింపాను. నాతో మీరు సరితూగగలరా?'', అని పరమ్మ ప్రభుత్వోద్యోగులను నిలదీసింది.

వారి జీవితాలలో ఇతర అంశాలలో వారు ఎంతో వెనుకబడి ఉన్నప్పటికీ, ఈ వ్యవసాయ జీవవైవిధ్యాన్ని పరిరక్షించే పనిలో నిమగ్నమై ఉన్నందున, వారికి దేశంలోను, వారి సమాజంలోను మరియు వారి ఇళ్ళల్లోనూ వారికి ఒక కొత్త గౌరవం లభించిందని ఈ మహిళలు భావిస్తున్నారు. వారి పొలాల విషయంలో తీసుకునే నిర్ణయాలలో తాము కీలక పాత్ర పోషిస్తామని ఈ మహిళలు చెప్పారు. చీలమామిడి లక్ష్మమ్మ అనే రైతు, తన భర్తతో కలిసి తన మూడెకరాల పొలంలో అనేక రకాల ఆహార పంటలు పండిస్తుంది. అభ్యుదయ బాటలో తమ పొలంలో హైబ్రిడ్ పంటలు వేయమని ఎవరో ఆమె భర్తకు సలహా ఇచ్చినప్పుడు, తాను ఉండే సామాజిక వాతావరణానికి భిన్నంగా, అతను తాను తన భార్యను అడిగి చెబుతానన్నాడు. అయితే అతను ఈ విషయం తన భార్యతో చెప్పినప్పుడు ఆమె విరుచుకుపడింది: ''నీకేమైనా మతి పోయిందా? మనకు హైబ్రిడ్ విత్తనాలు, ఏకపంట విధానం ఎందుకు? మనం పండిస్తున్న దానితో మనం ఆనందంగా లేమా?'' అని అంటే అతను కూడా సరేనన్నాడు. వారి సమాజంలోనూ, బయటా కూడా ఎంతో గుర్తింపు తెచ్చుకున్న తెలివైన, చురుకైన లక్ష్మమ్మ వంటి భార్యలు వారి భర్తల నుండి కూడా ఎంతో గౌరవం పొందుతున్నారు. ◆

**P.V. Satheesh**
Deccan Development Society, Pastapur Village,
Zaheerabad Mandal, Medak District - 502 220. TS
Email : satheeshperiyapatna@gmail.com
Website : www.ddsindia.com

ఆంగ్లమూలం :
లీసా ఇండియా సంపుటి 16, సంచిక 1 మార్చి 2014



వివిధ రకాల చిరుధాన్య పంటలను కోస్తున్న మహిళలు

# ఆహార ఆధిపత్య దిశలో

## చిరుధాన్య ఆధారిత జీవవైవిధ్య వ్యవసాయ వ్యవస్థ


### ప్రశాంత్ మొహంతి



**చిరుధాన్యాలు ఎంతో పుష్టికరమైన ఆహార పంటలు. ఇవి చాలా దృఢమైన పంటలు కాబట్టి ఈ పంటలు వాతావరణ మార్పులను తట్టుకుని నిలబడే గుణం కలిగిఉంటాయి. దురదృష్టవశాత్తూ, ఎక్కువ పెట్టుబడి పెట్టి చేసే ఏకపంట విధానాల వలన కొన్ని సంవత్సరాలుగా, ఈ పంటల కింద ఉన్న భూవిస్తీర్ణం తగ్గిపోతూ వస్తోంది. కంధమల్ ప్రాంతపు గిరిజన ప్రజలు ఈ ఏకపంట విధానాన్ని తిప్పికొట్టి, చిరుధాన్య ఆధారిత జీవవైవిధ్య పంట వ్యవస్థలకు మారిపోయారు. ఇప్పుడు వారు మరింత ఎక్కువ పరిమాణంలో, మరింత వైవిధ్యభరితమైన మరియు మరింత పౌష్టికత కలిగిన ఆహారాన్ని ఎంతో అనువైన, పర్యావరణానికి అనుకూలమైన వ్యవసాయ విధానాలతో పండిస్తున్నారు.**


ఒడిస్సా రాష్ట్రం, కంధమల్ జిల్లాలోని తుముడిబంధ బ్లాక్ చుట్టుపక్కల గ్రామాలలో ఎక్కువగా కుటియా కోంధ్ తెగ వారు నివసిస్తూ ఉంటారు. దారిద్ర్యం పట్టిపీడిస్తున్న పరిస్థితులలో కుటియా కోంధ్ తెగవారు వారి జీవనానికి వర్షాధార సేద్యం మీద, కొండ ప్రదేశాలలో చేసే పోడు వ్యవసాయం మీద ఆధారపడతారు. దీనితోబాటుగా, వారు అటవీ ఉత్పత్తుల మీద కూడా ఆధారపడుతారు. వారి వార్షిక ఆదాయంలో 15% వరకూ ఎన్.టి.ఎఫ్.పి., కలపేతర అటవీ ఉత్పత్తుల ద్వారానే లభిస్తుంది.

### వ్యవసాయం సాంప్రదాయ జీవనోపాధి

కుటియా కోంధ్ తెగకు మిశ్రమ వ్యవసాయంలో ఎంతో అనుభవం ఉంది. మిశ్రమ వ్యవసాయంలో వారు 40-50 పంటల వరకూ పండించేవారు. ఈ పద్ధతులన్నీ 20-25 సంవత్సరాల ముందు వాడుకలో ఉండేవి. ప్రభుత్వం హరిత విప్లవం పద్ధతుల ద్వారా వరి సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహించడంతో పొలాల్లో ఉండే అనేక రకాల చిరుధాన్యాలు మరియు పప్పుధాన్యాల పంటల వైవిధ్యం తరిగిపోసాగింది. అంతేకాక, ప్రభుత్వ ఆహార పంపిణీ



దృఢమైన ఈ చిరుధాన్యాలు నీటి ఎద్దడిని తట్టుకుంటాయి

వ్యవస్థ ప్రధానంగా వరిబియ్యం మీదే దృష్టి పెట్టడంతో రైతులు ఇతర పంటలు వదిలిపెట్టి వరి పంటకు మారిపోయారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో కేవలం ఒక 12-13 రకాల పంటలు మాత్రమే పండిస్తున్నారు.

సంవత్సరంలో కనీసం 200-210 రోజులు స్థానిక ప్రజలు వారి ఆహార అవసరాలు తీర్చుకోవడం కోసం ఆహారం కొనుక్కోవలసి వస్తోంది. ఈ కారణంగా వారి తక్కిన ఆహార ధాన్యాల అవసరాలకై వారు స్థానిక వడ్డీ వ్యాపారుల మీదో, లేదా వేరే వారి మీదో ఆధారపడవలసి వస్తోంది. సగటున, ఒక్కో కుటుంబం రూ.2800 మేరకు అప్పు కలిగి ఉంటోంది. ఈ అప్పులు ప్రధానంగా ఆహార కొరత తీర్చడానికి చేసినవే. ఈ అప్పు కోసం వారు వారికున్న చిన్న మాగాణి నేలను, పశువులను, కోతకొచ్చిన మామిడి, పనస పండ్ల చెట్లను, లేదా పసుపు, ఆవాల వంటి పంటలను అతి తక్కువ ధరకే కుదువపెడతారు.

2011లో, నిర్మాణ్, అనే ప్రభుత్వేతర సంస్థ గుమ గ్రామ పంచాయితీలోని దుపి గ్రామంలో చిరుధాన్యాల మీద ఒక అధ్యయనం జరిపింది. సుస్థిర వ్యవసాయం, జీవవైవిధ్య పరిరక్షణ, గ్రామీణ జీవనోపాధుల అంశాలపై ఆ ప్రాంతంలో పనిచేస్తూ ఉన్న నిర్మాణ్ సంస్థ, 2001 నుండి కంధమల్‌లో చిరుధాన్య ఆధారిత వ్యవసాయంపై పనిచేయడం మొదలుపెట్టింది.

ఆ ప్రాంతంలో చిరుధాన్య ఆధారిత జీవవైవిధ్య వ్యవసాయ వ్యవస్థ కింద ఉన్న భూవిస్తీర్ణం తగ్గిపోతూ, కుటుంబ స్థాయిలో ఆహార మరియు, పౌష్టికత యొక్క భద్రత మీద తీవ్రమైన ప్రభావం చూపిస్తున్నట్లు ఆ అధ్యయనంలో తేలింది. నిర్మాణ్ సంస్థ ఎన్నో చర్చలు జరిపి, ఈ చిరుధాన్యాలు పెరుగుతున్న ఉష్ణోగ్రతలను, నీటి ఎద్దడి పరిస్థితులను తట్టుకోగలగడంతోబాటు పుష్టికరమైన ఆహారాన్ని కూడా అందిస్తాయన్న విషయాన్ని తెలుసుకున్నారు. రైతులు తిరిగి ఈ చిరుధాన్య ఆధారిత వ్యవసాయ వ్యవస్థను నెలకొల్పేలా నిర్మాణ్ సంస్థ రైతులను ప్రోత్సహించడం మొదలుపెట్టింది. విధానపరమైన వాదాన్ని ప్రభావితం చెయ్యడం కొరకు చిరుధాన్య రైతుల నెట్ వర్క్ / సంస్థ యొక్క ఏర్పాటుకు కూడా నిర్మాణ్ సంస్థ తోడ్పడింది.

> కుటుంబ స్థాయిలో ఆహార భద్రత మరొక 45 నుండి 60 రోజులకు పొడిగింపబడింది. విత్తనాల కొరతతో ఇబ్బందిపడుతున్న గ్రామ ప్రజలు కేవలం ఒక్క పంటకాలంలో విత్తనాల విషయంలో స్వయంసమృద్ధి సాధించారు.

## చిరుధాన్య ఆధారిత జీవవైవిధ్య వ్యవసాయాన్ని తిరిగి నెలకొల్పడం

నిర్మాణ్ సంస్థ 14 గ్రామాలలోని 306 కుటుంబాలతో గ్రామ స్థాయి చర్చలు జరిపింది. వీరితో ఆహారం, పౌష్టికత భద్రతకు సంబంధించిన అంశాలు, వ్యవసాయ ఆచరణ పద్ధతులలో చోటుచేసుకుంటున్న మార్పులు విస్తారంగా చర్చించడం జరిగింది. చిరుధాన్య ఆధారిత వ్యవసాయాన్ని పునరుద్ధరించుకోవలసిన అవసరాన్ని ఆ ప్రజలు గుర్తించారు.

ఈ చొరవను చేపట్టడంలో నిర్మాణ్ సంస్థ ప్రజలే నాయకత్వం వహించే పద్ధతిని అవలంభించింది. గ్రామ స్థాయి సంస్థలే ఆహార ఉత్పత్తి వ్యవస్థపై పట్టు కలిగిఉండేలా, విత్తన నిధి ఏర్పాటు ద్వారా వారి జీవనోపాధులను మెరుగుపరచుకునేలా, శిక్షణా కార్యక్రమాలు మరియు అవగాహనా యాత్రల ద్వారా పరిజ్ఞానాన్ని పంచుకునేలా మరియు చిరుధాన్య ఆధారిత జీవవైవిధ్య వ్యవసాయ వ్యవస్థను తిరిగి నెలకొల్పేలా నిర్మాణ్ సంస్థ వారిని ప్రోత్సహించింది.

ప్రతి గ్రామంలో, ఒక గ్రామ స్థాయి సంస్థ ఏర్పాటుచేయబడింది. మొత్తం ప్రజలందరికి కలిపి ఎంత విత్తనం అవసరం అవుతుంది అన్నది ఈ గ్రామ స్థాయి సంస్థలే అంచనా వేసి, ఆ విత్తనాలు తెచ్చేలా నిర్ణయం జరిగింది. చిరుధాన్యాల విత్తన నిధి ఏర్పాటు మరియు దాని నిర్వహణ గురించి ఈ గ్రామస్థాయి సంస్థలకు అవగాహన ఏర్పరచడం కూడా జరిగింది. రైతులు, ముఖ్యంగా మహిళా రైతులు సులువుగా విత్తనాన్ని వృద్ధి చేసుకోవడానికి అనువైన ''ఓపెన్ పాలినేటెడ్'' (హైబ్రిడ్ రకాలు కాని) రకాలే ప్రధానంగా ఎంచుకున్నారు.

రైతు బృందాలు వారికి ఎంత చిరుధాన్య మరియు పప్పుధాన్య పంటల విత్తనాలు కావాలి అన్నది అంచనా వేసాయి. మొదట్లో ఒకసారి నిర్మాణ్ సంస్థ 12 రకాల విత్తనాలు అందించింది. ఈ విత్తనాలను గ్రామ స్థాయి సంస్థలు (వి.ఎల్.ఐ.లు, విలేజ్ లెవెల్ ఇన్‌స్టిట్యూషన్స్) మూల విత్తనాలుగా పెట్టుకుని విత్తన నిధిని ఏర్పాటుచేసి, వీటిని వృద్ధి చేసి వారి ప్రజల యొక్క విత్తన అవసరాలను తీర్చాయి.

మహిళలకు సహజంగానే ఈ విత్తనాల ఎంపికలో, నిలువచేయడం లో మంచి నేర్పూ, ఓర్పూ ఉంటాయి కాబట్టి, ఈ కార్యక్రమంలో ప్రముఖ పాత్ర మహిళలకే అందించడం జరిగింది. ఇంటిస్థాయిలో ఏ రకం విత్తనం కావాలి, ఎంత విత్తనం కావాలి అన్నదానికి సంబంధించిన చర్చలలో మహిళలు క్రియాశీలకంగా పాల్గొన్నారు. అలాగే విత్తనాల పంపిణీలో కూడా మహిళలు కీలక పాత్ర పోషించారు. గ్రామ స్థాయి సంస్థ సమావేశాలలో మహిళలకే అధ్యక్ష, కార్యదర్శి పదవులు ఇచ్చారు.

ఒక్క పంటకాలంలో మొత్తం 25 పంట రకాలు పునరుత్పత్తి చేయబడ్డాయి. పంటలు వేసే కాలం పొడిగించబడింది. దిగుబడులు కూడా పెరిగాయి. తద్వారా కుటుంబ స్థాయిలో ఆహార భద్రత పెరిగింది.

## జీవవైవిధ్య ఉత్సవం

కుటియా కోంధ్ తెగ వారు వారి గ్రామంలో పంటకోత తరువాత బర్లాంగ్ యాత్ర అనే పండుగ జరుపుకుంటారు. గ్రామ స్థాయిలో ఈ పండుగ జరుపుకోవడానికి నిర్మాణ్ సంస్థ ఆ గ్రామ ప్రజలకు తోడ్పడింది. అదేవిధంగా, వివిధ గ్రామాల ప్రజల మధ్య ఐకమత్యం పెంచడానికి, నిర్మాణ్ సంస్థ మొట్టమొదటిసారి గ్రామ పంచాయతీ స్థాయిలో కూడా బర్లాంగ్ యాత్రను నిర్వహించింది. ఈ పండుగ, వివిధ స్థానిక విత్తనాలను, వ్యవసాయ ఆచరణ పద్ధతులను, వారి జీవనశైలిని ప్రదర్శించే అవకాశం ఇచ్చి వ్యవసాయ-జీవవైవిధ్య పునరుద్ధరణ గురించి అందరికీ చాటిచెప్పింది. వారు పరిరక్షించిన స్థానిక విత్తనాలను, వారి పంట వ్యవస్థలను మరియు పంటల వైవిధ్యం పెంచుకోవడం వలన ఆహార మరియు పౌష్టిక భద్రత ఎలా పెరిగిందో అన్నది వారికి సాధ్యపడినంత మేరకు ఆ గ్రామ ప్రజలు ప్రదర్శించారు.

స్థానిక ప్రజలు తాము పండిస్తున్న చిరుధాన్యాల, పప్పు ధాన్యాల, వరి, నూనె గింజ పంటల మరియు కూరగాయ విత్తనాలను ప్రదర్శనకు ఉంచారు. విత్తనాలు ఇచ్చిపుచ్చుకోవడంతోబాటు, వ్యవసాయ ఆచరణ పద్ధతుల గురించిన వారి పరిజ్ఞానాన్నీ, అనుభవాన్నీ కూడా పంచుకోవడం జరిగింది. అంతేకాక, ఆ రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలనుండీ మరియు పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కి చెందిన రైతులు కూడా ఈ సంబరంలో పాల్గొన్నారు.

గుమ గ్రామ పంచాయతీ రైతులు చిరుధాన్య ఆధారిత జీవవైవిధ్య సేద్యం పునరుద్ధరణ ద్వారా తాము తమ ఆహార మరియు పౌష్టికత భద్రతను ఎంతగా పటిష్టపరచుకున్నామన్నదీ వివరించారు. సంబంధిత వ్యక్తుల యొక్క ఆలోచనా విధానాన్ని ప్రభావితం చెయ్యడానికీ, పాఠశాల మరియు అంగన్‌వాడీ కేంద్రాలలో అమలు జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకాలలో చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహారం ఉండాలని చెప్పడానికీ ఆ గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు.

## ప్రయోజనాలు మరియు భావి ప్రయాణం

చిరుధాన్య ఆధారిత సేద్య వ్యవస్థ తిరిగి నెలకొల్పడంతో, 14 గ్రామాలలోని పంట పొలాల్లో పంట వైవిధ్యం 13 నుండి 25కి పెరిగింది. దీనివలన అందుబాటులో ఉన్న ఆహారం పెరిగింది. కుటుంబ స్థాయిలో ఆహార భద్రత మరొక 45 నుండి 60 రోజులకు పొడిగింపబడింది. విత్తనాల కొరతతో ఇబ్బంది పడుతున్న గ్రామ ప్రజలు కేవలం ఒక్క పంటకాలంలో విత్తనాల విషయంలో స్వయంసమృద్ధి సాధించారు. ముఖ్యంగా సాధించిన విషయం ఏమిటంటే, పంట వైవిధ్యంతోబాటు అంతరించిపోతున్న సాంప్రదాయ పరిజ్ఞానం పునరుద్ధరించబడింది. ముందు ముందు చేపట్టాలని అనుకుంటున్న కార్యక్రమాలు - పార్టిసిపేటరీ గ్యారంటీ సిస్టం (పి.జి.ఎస్.), భాగస్వామ్య హామీ వ్యవస్థ కింద సేంద్రీయ ధృవీకరణ, విలువ వృద్ధి, మార్కెట్ లంకెల ఏర్పాటు మరియు మహిళా సంఘాలను పటిష్టపరచడం.

చిరుధాన్య ఆధారిత వ్యవసాయ వ్యవస్థలు మనుషుల ఆరోగ్యానికి మరియు పర్యావరణానికి చేకూర్చే అనేక రకాల ప్రయోజనాల గురించి అందరికీ తెలియచెప్పే ప్రయత్నం కూడా జరిగింది. కరపత్రాల వంటి సందేశాన్నందించే సామగ్రి రూపొందించబడి, పంచబడింది. చిరుధాన్యాలు మరియు పంట వైవిధ్యానికి సంబంధించిన అంశాలపై దృష్టి పెట్టి, 'కృషక్ స్వరాజ్' అన్న సమాచార పత్రిక కూడా ప్రచురించడం జరిగింది.

కంధమల్ జిల్లాలోని అత్యల్ప-వర్షపాత ప్రాంతాలలోని ప్రజల యొక్క ఆహార మరియు పోషకావసరాలను తీరుస్తున్న, నిర్మాణ్ సంస్థ ప్రోత్సహించిన ఈ నమూనా ఈనాటి వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారం చూపిస్తుంది. అనిశ్చిత వర్షపాతం, వాతావరణ మార్పు వంటి పరిస్థితులకు ఈ నమూనా అత్యంత అనుకూలమైనది. అందువలన ఈ వ్యవసాయ వ్యవస్థ తిరిగి కోలుకునే గుణం కలిగి ఉంటుంది. మొదటి సంవత్సరం చేపట్టిన ఈ ప్రయోగం ఆ తరువాత సంవత్సరం 27 గ్రామాలలోని 445 కుటుంబాలకు విస్తరించ బడింది. అంగన్వాడిలోని మధ్యాహ్న భోజన కార్యక్రమంలో చిరుధాన్యాలను చేర్చుకునేందుకు ప్రయత్నాలు ఇంకా కొనసాగుతున్నాయి. ఇందుకొరకు ప్రభుత్వాధికారులను, మీడియావారిని, అభిప్రాయాన్ని ప్రభావితంచేసేవాళ్ళనూ కలిసి మాట్లాడడం జరుగుతోంది. ◆

**Prashant Mohanty**
NIRMAN, S-3/751-Niladri Vihar, PO Sailashree Vihar,
Bhubaneswar - 751021. Odisha.
Email : prasantmohanty@gmail.com

ఆంగ్లమూలం :
లీసా ఇండియా సంపుటి 16, సంచిక 1 మార్చి 2014

# దారిద్ర్యం నుండి బయటపడుతున్న మహిళలు

లాండేసా

**మహిళా సాధికారత మరియు గ్రామీణ జీవనోపాధుల విషయంలో పెద్ద ఎత్తున విజయాన్ని సాధించిన కార్యక్రమాలు రెండు - కేరళ రాష్ట్రంలోని కుడుంబశ్రీ (కె.డి.ఎస్.) పథకం మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఇందిరా క్రాంతి పథకం (ఐ.కె.పి.). యు.ఎస్.విమెన్ అప్పగిస్తే, లాండెసా సంస్థ చేపట్టిన ఒక అధ్యయనం ద్వారా, మహిళలకు సాధికారత కల్పించగల వ్యవస్థలను మరియు ప్రక్రియలను సునిశితంగా అర్థం చేసుకోవడం జరిగింది. అంతేకాక, ఈ సాధికారతను మరింత పటిష్టపరిచేందుకు ఇంకా ఏ ఏ అంశాల మీద దృష్టిపెట్టాలన్నది కూడా ఈ అధ్యయనంలో భాగంగా తెలుసుకోవడం జరిగింది.**

భారతదేశంలో మహిళలకు సామాజిక మరియు ఆర్థిక సాధికరత చేకూర్చడానికి ప్రతిసృజనీయమైన (తిరిగి వేరేచోట అమలుచేయగల వీలు కలిగిన) మార్గంగా స్వయం సహాయక బృందాల పద్ధతి స్థాపితమైనప్పటినుండి అనేక రాష్ట్ర స్థాయి కార్యక్రమాలు, మరియు ఇతర కార్యక్రమాలు కూడా మహిళా స్వయం సహాయక బృందాల ఆధారంగా రూపొందించబడి, విజయవంతంగా అమలౌతున్నాయి.

వీటిలో కేరళ రాష్ట్రంలోని కుడుంబశ్రీ (కె.డి.ఎస్.) మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఇందిరా క్రాంతి పథకం ముఖ్యంగా చెప్పుకోదగ్గ కార్యక్రమాలు. ఈ రెండు కార్యక్రమాలూ కూడా అధిక సంఖ్యలో గ్రామీణ మహిళలను కూడగట్టి అనేక అంచెలుగా ఉన్న సంఘాలుగా ఏర్పాటుచెయ్యగలిగాయి.

వ్యవసాయాభివృద్ధి, చిన్నచిన్నవ్యాపారాలు, ఉత్పత్తులమార్కెటింగ్, ఆరోగ్యం విద్య, లింగ సమానత తదితర అంశాలలో అనేక కార్యక్రమాలు మొదలుపెట్టడానికి ఈ సంఘాలు వెన్నముకగా నిలిచాయి. వీటిలో ముఖ్యంగా వ్యవసాయంలో మహిళలకు సాధికారత కల్పించే లక్ష్యంతో మొదలుపెట్టిన కార్యక్రమాలలో చెప్పుకోవలసిన ఉపకార్యక్రమాలు రెండు. మొదటిది, ఐ.కె.పి. కింద అమలైన కమ్యూనిటీ మానేజ్డ్ సస్టైనబుల్ అగ్రికల్చర్ (సి.ఎం.ఎస్.ఎ.) మరియు కె.డి.ఎస్. పరిధిలో అమలైన కలెక్టివ్ లీజింగ్ కార్యక్రమం. 'వ్యవసాయంలో మహిళలు' అన్న ప్రాతిపదిక మీద చేపట్టిన రెండు కార్యక్రమాలూ ఇప్పుడు భారతదేశంలో నెలకొని ఉన్న వ్యవసాయ పరిస్థితులను మార్చడానికి లక్షలాది మహిళలు పూనుకునేలా చేయడంతోబాటు, ''మహిళా సశక్తీకరణ్ పరియోజన'' అన్న పేరుతో ఒక జాతీయ మహిళా రైతు సాధికారతా కార్యక్రమాన్ని 12 రాష్ట్రాలలో అమలుచేస్తూ 2 మిలియన్ మహిళలను చేరుకోవడం జరిగింది.

ఈ మహిళలు పంటలసాగు, సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోవడం మరియు అవలంభించడం, విస్తారమైన బంజరు భూములను సాగులోకి తేవడం, మార్కెట్ చెయ్యడం వంటివి చేసారు. అంతేకాక ఈ పనులన్నీ చేసే ప్రక్రియలో ఈ మహిళలు ఒక సాధారణ గృహిణి మరియు రైతు కూలీ స్థాయి నుండి వ్యవసాయ విధానాన్ని మార్చే కార్యకర్తలుగా మారారు. ఉదాహరణగా ఈ రెండు కార్యక్రమాల నుండీ చెరొక ఉదంతం ఇక్కడ ఇవ్వడం జరిగింది. మార్కెటింగ్, ట్రైనింగ్ (శిక్షణ), కొత్త చొరవలు వంటి అంశాలలో రాష్ట్ర ప్రభుత్వాన్ని, ప్రభుత్వేతర సంస్థలని, మార్కెటింగ్‌లోని వ్యక్తులు/సంస్థలను ఒకచోట కూర్చోడంలో ఈ రెండు కార్యక్రమాలూ విజయం సాధించాయి.

## సి.ఎం.ఎస్.ఎ. : ఇంటి స్థాయిలో ఆహార భద్రతకు దారి చూపించడం

ఎక్కువ శక్తిని వినియోగించి, ఎక్కువ పెట్టుబడి పెట్టి, రసాయనిక ఎరువులు, రసాయనిక పురుగుమందులు వాడి పంటలు పండించే విధానం నుండి, పంట యాజమాన్య పద్ధతులలో మార్పులు, చేర్పులు చెయ్యడం ద్వారా పంటల ఉత్పత్తికి జీవావరణపరంగా, ఆర్థికపరంగా సుస్థిరమైన పద్ధతులు అవలంభించేటట్లు చెయ్యడమే సి.ఎం.ఎస్.ఎ. యొక్క లక్ష్యం. మహిళలను ప్రధానమైన వాహకంగానూ, యజమానులుగానూ చేయడం ద్వారా, సి.ఎం.ఎస్.ఎ. కార్యక్రమం, మహిళలకి ఆర్థిక సాధికారత కూర్చే ఈ చొరవకు అత్యంత చాకచక్యంగా రూపకల్పన చేసింది.

భారతదేశపు వర్గీకరణ ప్రకారం, లక్ష్మి చిన్న తరహా రైతు వర్గానికి చెందుతుంది. విశాఖపట్నం జిల్లా, పద్మనాభం మండలంలోని కొరాడా గ్రామంలో ఈమె కుటుంబానికి ఒక ఎకరం భూమి ఉంది. నీటి లభ్యత బట్టి, రెండు కాలాలలో వీరి పొలంలో వరి, కూరగాయలు, పప్పు ధాన్యాలు, చిరు ధాన్యాలు, బొప్పాయి లాంటి పంటలు వర్షాధారంగా పండిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనేక చిన్న రైతుల కుటుంబాలలో వలెనే, లక్ష్మి కుటుంబంలో కూడా వ్యవసాయంలో వచ్చిన డబ్బు ఆహారం కొనుక్కోవడానికీ, వ్యవసాయం చెయ్యడానికీ, అంటే రసాయనిక ఎరువులూ, పురుగుమందుల కొనుగోలుకు చేసిన అప్పు తాలూకు వడ్డీ కట్టడానికి వాడుతారు. ఎకరం భూమి ఉన్నప్పటికీ కూడా ఆ కుటుంబానికి, వారికి సరిపడా ఆహారం కానీ, ఆదాయం కానీ లేదు. ఏ రకంగా చూసినా ఆమె అత్యంత నిరుపేద కాకపోయినా, చాలా పేదరాలు అని మాత్రం చెప్పవచ్చు.

జీవన ఎరువులు, రసాయనేతర పురుగుమందులు, మల్చింగ్ మరియు శ్రీసాగు పద్ధతుల ద్వారా లక్ష్మి కుటుంబం వారి ఉత్పత్తిని, వారు ఉత్పత్తి చేస్తున్న పంట రకాలని గణనీయంగా పెంచుకున్నారు. వారు గతంలో పెట్టిన పెట్టుబడిలో, నాలుగింట ఒక ఒంతు మాత్రమే పెట్టుబడి పెట్టి, సంవత్సరానికి అనేక పంటలు తీయడం మొదలుపెట్టారు. మెరుగైన, అధిక దిగుబడులు సాధించారు. అంతేకాక, పంట వైవిధ్యం కూడా పెరిగింది. ఇప్పుడు వారు కూరగాయలు, పప్పు ధాన్యాలు వంటివి మార్కెట్‌లో కొనవలసిన అవసరం బాగా తగ్గిపోయింది. వారి ఆర్థిక పరిస్థితి బాగుపడడంతో వారు ఇప్పుడు మరొక అర ఎకరం కౌలుకి తీసుకున్నారు. ఈ అర ఎకరంలో, సగం విస్తీర్ణంలో శ్రీవరి సాగు చేస్తూ, మిగతా సగంలో 36 అడుగుల x 36 అడుగుల ''సెవెన్ టైర్'' (ఏడు అంతస్తుల) నమూనాలో కూరగాయలు, పండ్లు, దుంపలు పెంచారు. వీటితోబాటు, ఇతర జీవనోపాధి మార్గంగా, వారు స్థానికంగా జీవన ఎరువులు, జైవిక పురుగు మందులు అమ్మే ఒక ఎన్.పి.ఎం. (నాన్ పెస్టిసైడల్ మానేజ్‌మెంట్ - రసాయనిక పురుగుమందులు వాడని పంట సంరక్షణ) షాపు పెట్టారు.

తగినంత పరిమాణంలో వైవిధ్యభరితమైన కూరగాయలు, పప్పు ధాన్యాలు, దుంపలు, పండ్లు అందించే తన బహుళ అంతస్తుల కూరగాయల తోట గురించే మాట్లాడుతూ ఉంటుంది లక్ష్మి. ఈ 36 అడుగుల x 36 అడుగుల నమూనాలో 7 అంతస్తులలో పంటలు పండించడం జరుగుతుంది. ఎండ అతి తక్కువగా అవసరమయ్యే క్యారెట్, బీట్‌రూట్ మరియు అల్లం వంటి దుంప పంటలు మొదటి శ్రేణిలో ఉంటాయి. ఆనప, దోస పాదులు రెండవ వరుసలో ఉంటాయి. నేల మీద పరచుకుని ఉన్న ఈ పాదులు జీవ మల్చ్‌గా పనిచేస్తాయి. మూడవ శ్రేణిలో గోంగూర, బచ్చలి, కొత్తి మీర, తోట కూర వంటి ఆకు కూరలు ఉంటాయి. నాలుగవ శ్రేణిలో వంకాయ, టమోటా మరియు మిరపకాయలు ఉంటాయి. అయిదవ శ్రేణిలో బొప్పాయి, మునగ, సీతాఫలం మరియు జామ వంటి పండ్ల చెట్లు ఉంటాయి. ఏడవ శ్రేణిలో కూడా మామిడి వంటి పండ్ల చెట్లే ఉంటాయి. ఎండ అత్యధికంగా తగలవలసిన చెట్లు ఇవి. ఇలా ఏడాది పొడవునా అనేక రకాల పంటలు పండించడం వలన సంవత్సరం అంతా ఆహారం అందుబాటులో ఉంటుంది.

> సూక్ష్మ వ్యాపారాలలో 900 మంది మహిళా బృందాలు పనిచేస్తూ ఉండగా, 2.15 లక్షలకు పైగా మహిళా బృందాలు కౌలుకు తీసుకున్న భూములలో సమిష్టి వ్యవసాయం చేస్తున్నారు. దీనిని బట్టి చూస్తే, మహిళా సభ్యురాళ్ళలో సమిష్టి కౌలు విధానం ఎంత ప్రాచుర్యం పొందిందో తెలుస్తోంది

ఇందువలన కుటుంబానికి పోషకాహార భద్రతతోబాటు, ఆ చిన్న కమతం నుండే కుటుంబానికి క్రమం తప్పకుండా కొంత ఆదాయం లభిస్తూ ఉంది. 0.25 ఎకరం భూమిలో, ఈ 7 అంతస్తుల ఉత్పత్తి వ్యవస్థ నలుగురు సభ్యులున్న లక్ష్మి కుటుంబానికి సరిపడా ఆహారం అందించడమే కాక మార్కెట్‌లో అమ్మకానికి కూడా ఉండేంత ఆహారం పండుతోంది.

శ్రీ సాగు సద్ధతులు పాటించడం వలన, జీవన ఎరువులు, జీవ కీటకనాశినులు ఉపయోగించడం వలన లక్ష్మి వరి పంట గతంలో కన్నా ఎంతో ఎక్కువ దిగుబడి ఇచ్చింది. వాన నీటిని సమర్ధవంతంగా వినియోగించుకోవడంతో లక్ష్మి గతంలోలా సంవత్సరానికి ఒక పంట కాక, వరి మరియు కాయ ధాన్య పంటలు సంవత్సరానికి రెండుసార్లు పండించగలిగింది. అంతేకాక, భూమిని సారవంతం చెయ్యడం, దిగుబడి పెంచడం మరియు కుటుంబ వినియోగానికి మించి కొంత మార్కెట్ చెయ్యడానికి సరిపడా ఫలసాయం పొందడం కూడా జరిగింది. లక్ష్మి చేపట్టిన మరొక ముఖ్య ప్రయత్నం, వారి బృందం తరపున వరి, కూరగాయలు మరియు పండ్ల విత్తనాలను సంరక్షించే విత్తన బ్యాంకును ఏర్పాటుచేసి, నిర్వహించడం. 36 అడుగుల x 36 అడుగుల నమూనాలో పండిన కూరగాయల, దుంపల, పండ్ల విత్తనాలతో ఈ విత్తన బ్యాంకు ముందు సి.ఎం.ఎస్.ఎ. రైతులు మొదలుపెట్టిన ప్రయత్నంగా జరిగినా, అతి త్వరలో ఒక పెద్ద కార్యక్రమంగా రూపుదిద్దుకుంది. ఇక్రిసాట్ వంటి పరిశోధనాలయాల వారి విత్తనాలు కూడా వచ్చి ఈ ఎస్.హెచ్.జి. వారి విత్తన నిధిలో చేరాయి. 5 రకాల విత్తనాలతో మొదలైన ఈ విత్తన బ్యాంకులో ఇప్పుడు 18 రకాల విత్తనాలు ఉన్నాయి. సభ్యులు ఎవరైనా ఈ విత్తన నిధి నుండి విత్తనాలు అప్పుగా పొందవచ్చు. అయితే షరతు ఏమిటంటే, పంట చేతికొచ్చాక వారు ఎంత విత్తనం తీసుకున్నారో, అంతే మోతాదు విత్తనాలను, మరియు మరొక 50% విత్తనాలను తిరిగి విత్తన నిధికి అందించాల్సి ఉంది. ఈ విధంగా విత్తనం ఇతర సభ్యులకు కూడా అందుతుంది. ఇలా విత్తనాలు ఇచ్చిపుచ్చుకోవడం గ్రామ సంస్థలు, మండల సమాఖ్యల మధ్య కూడా జరగడం మొదలైంది. అంతేకాక ఈ ప్రక్రియ ఆ జిల్లాను దాటి కూడా వ్యాప్తి చెందింది. విత్తన బ్యాంకు నడపాలంటే విత్తనాలు నిలువచెయ్యడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం ఉండాలి. దానితో బాటే అకౌంటింగ్ కూడా తెలిసి ఉండాలి. ఇవి రెండూ లక్ష్మి నేర్చుకుని ఈ విత్తన నిధి ఏర్పాటు, నిర్వహణ బాధ్యత తీసుకుంది. తన ఇంటిలోనే ఈ విత్తన నిధికై కొంత స్థలం కేటాయించి, తమ బృందం తరపున ఈ విత్తన నిధిని నడుపుతోంది.

ఇదంతా ఆమె జీవితంలో ఎటువంటి మార్పును తీసుకువచ్చింది? ఇప్పుడు సంవత్సరానికి తమ కుటుంబ నికర ఆదాయం రూ.50,000/- పైగా వుందని చెబుతుంది లక్ష్మి. మరి గతంతో

పోలిస్తే ఇది చాలా గణనీయమైన పెంపు అనే చెప్పాలి. ముఖ్యం గా ఇప్పుడు ఆమె కుటుంబ సభ్యులు రోజూ అనేక రకాల కూరగాయలు, పండ్లు, దుంపలు తింటున్నారు. తమ అప్పులు కూడా చాలా వరకూ తీరిపోయాయని కూడా ఆమె చెప్పారు. ఈ విజయం వలన తన మీద తనకి నమ్మకం ఏర్పడడంతో బాటు కుటుంబంలో నిర్ణయాలు తీసుకునేటప్పుడు తనను కూడా చేర్చుకోవడానికి దోహదపడిందని అంటుంది లక్ష్మి.

ఇప్పటికీ ఆమె కుటుంబంలోని మగవారి నిర్ణయాలకే కట్టుబడి ఉంటున్నప్పటికీ, కొన్ని కొన్ని చోట్ల ఆమెకు పూర్తి స్వేచ్ఛ ఉంది. గతంలో అయితే సి.ఎం.ఎస్.ఎ. వారి ప్రయోగాలను చేపట్టే విషయంలో కుటుంబ సభ్యులను ఒప్పించడం ఆమెకు కష్టం గా ఉండేది. కానీ ఇప్పుడు, వాళ్ళ పొలంలో ఏ ఏ పంటలు, ఏ ఏ కూరగాయలు వెయ్యాలి, ఎంతెంత కోనాలి, ఎంతెంత అమ్మాలి, వచ్చిన డబ్బులు ఎలా ఖర్చు పెట్టాలి అన్న విషయాలలో లక్ష్మి తమ కుటుంబ సభ్యులను ఒప్పించి, స్వతంత్రించి నిర్ణయాలు తీసుకోగలుగుతోంది. తాను పండించిన ఉత్పత్తిని ఆమె విజయ నగరం మార్కెట్‌కి తీసుకుని వెళ్ళి అమ్ముతుంది. వచ్చేటప్పుడు జీవన కీటకనాశినుల తయారీకి అవసరమైన పదార్థాలను కొనుక్కుని తెచ్చుకుంటుంది.

సుస్థిర వ్యవసాయ పద్ధతులను అవలంభించి తమ కుటుం బానికి ఆహార భద్రత సాధించుకున్న లక్ష్మి తమ కుటుంబం లో మార్పుకు కారణం అయ్యింది. సరైన ఆచరణ పద్ధతులు పాటిస్తే వర్షాధార ప్రాంతాలు మరియు వాటిపైన ఆధారపడ్డ కుటుంబాలు కూడా ఆహార భద్రతను కలిగి ఉండగలవని లక్ష్మి ఉదంతం నిరూపించింది. లక్ష్మి మాటల్లోనే చెప్పాలంటే, ''మేము మామూలు వ్యవసాయ పద్ధతులు పాటించినంత కాలం మేము పేదగానే ఉన్నాము. అయితే సి.ఎం.ఎస్.ఎ. పద్ధతులు అవలంభిం చడంతో మా కుటుంబం దారిద్ర్యం నుండి బయటపడింది'' అని అంటుంది లక్ష్మి.

## కలెక్టివ్ లీజింగ్ (సమిష్టి కౌలు విధానం) మహిళలను రైతులుగా మార్చడం (కేరళ)

కుడుంబశ్రీ (కె.డి.ఎస్.) అన్నది కేరళ ప్రభుత్వం చేపట్టిన రాష్ట్ర దారిద్ర్య నిర్మూలనా కార్యక్రమం. కేరళలో గ్రామ స్థాయిలో కూడగట్టిన మహిళా బృందాలను (ఎస్.హెచ్.జి.లు) నైబర్హుడ్ గ్రూప్స్ (సామీప్య బృందాలు ఇరుగు పొరుగున ఉన్న మహిళలు జట్టుగా ఏర్పడిన బృందాలు) అంటారు. కె.డి.ఎస్. కూడా గ్రామ స్థాయి మహిళలని కూడగట్టడానికి 3 టైర్ (అంచెల) నమూనాను అవలంభించింది. వార్డ్ స్థాయిలో ఏరియా డెవలప్‌మెంట్ సొసైటీలు (ఎ.డి.ఎస్.), గ్రామ పంచాయితీ స్థాయిలో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీలు (సి.డి.ఎస్.), ఒక్కో స్థాయిలో ఎన్నిక కాబడ్డ మహిళా ప్రతినిధులతో ఏర్పాటుచేయబడ్డాయి. సి.డి.ఎస్., ఎ.డి.ఎస్. మరియు ఎస్.హెచ్.జి. స్థాయిలలో చేపడుతున్న కలెక్టివ్ లీజింగ్ (సమిష్టి కౌలు విధానం) కార్యక్రమాన్ని మొత్తం మహిళలే నిర్వహిస్తున్నారు.

''మీ ఆర్థిక పరిస్థితి మెరుగుపరచుకోవడానికి మీరు ఏమి చేయాలి అనుకుంటున్నారు?'', అని ఎవరైనా, ఏ ఎస్.హెచ్.జి. మహిళనైనా అడిగితే, దాదాపు 98% మంది ''మేము లీజుకి తీసుకున్న భూమిలో సమిష్టి వ్యవసాయం చేస్తాము'' అని అంటారని తిరువనంతపురంలోని కుడుంబశ్రీ అధికారి ఒకరు అన్నారు. చిన్న వ్యాపారాలలో (మైక్రో ఎంటర్‌ప్రైజెస్) 900 మంది మహిళా బృం దాలు పనిచేస్తుంటే, లీజుకి తీసుకున్న భూమిలో సమిష్టి సేద్యం చేపడుతున్న మహిళా బృందాలు 2.15 లక్షలు. దీన్ని బట్టి చూస్తే మహిళా సభ్యులలో సమిష్టి కౌలు విధానం ఎంత ప్రాచుర్యం పొందిందో తెలిస్తే, అది ఎలా అంత విజయం సాధించింది అన్నది ఈ కథ తెలుపుతుంది.

త్రిస్సూర్ జిల్లా, ముల్లషెరి గ్రామ పంచాయితీలోని 'గ్రామ శ్రీ' జాయింట్ లయబిలిటీ గ్రూప్‌లో రమణి శ్రీనివాసన్, షీబా బాలక్రిష్ణన్, శ్రీజాదరన్, మరియు బిందు సత్యాన్ సభ్యురాళ్ళు. కె.డి.ఎస్. అంతకు ముందెప్పుడో 2006లోనే, వ్యవసాయాన్ని ఆర్థిక కార్యక్రమంగా చేపట్టినప్పుడే ఒక ఎస్.హెచ్.జి.లోని మహిళలు కలెక్టివ్ లీజింగ్ (సమిష్టి కౌలు) కొరకు బృందంగా ఏర్పడ్డారు. ఎస్.హెచ్.జి.లలోని ఈ బృందాలకు ''యాక్టివిటీ గ్రూప్స్'' (క్రియాశీలక బృందం), ఏ.జి. అని కె.డి.ఎస్. నామకరణం చేసింది. ఒక యాక్టివిటీ గ్రూప్ కనుక సేద్యం మొదలుపెడితే, వారు కొన్ని బ్యాక్-ఎండ్ సబ్సిడీలు పొందడానికి అర్హులౌతారు. రమణి తదితరులంతా భూమి లేని వ్యవసాయ కూలీలు. వీరంతా స్థానిక రైతుల పొలాలలో పనిచేస్తూ జీవనం సాగించేవారు. వీరం తా కలిసి ముగ్గురు భూస్వాముల పొలాలలో పనిచేసేవారు. ఈ భూస్వాముల భూములన్నీ ఒకదానిని, ఒకటి ఆనుకుని వరుసగా 13.5 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉన్నాయి. కూలీ ఖర్చులు (అప్పట్లో రోజుకు రూ.125/-) భరించలేక ఈ భూస్వాములు 1998లో వారి భూములను సాగుచేయడం మానివేస్తే, ఆ భూమి కొన్ని సంవత్సరాలు బీడుగా పడి ఉంది.

ఆ సమయంలో రమణివాళ్ళకి గ్రామ పంచాయితీ ద్వారా ఈ సమిష్టి కౌలు కార్యక్రమం గురించి తెలిసింది. వారంతా ఈ సమిష్టి కౌలు కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించుకుని 1998 నుండి కుడుంబశ్రీ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయం చెయ్యడం మొదలుపెట్టారు. వీరంతా ఒకరికొకరు తెలిసున్నవారే. వీరంతా గతంలో ఇదే భూస్వాముల దగ్గర పనిచేశారు కూడా. కాబట్టి ఈ మహిళలు తాము పనిచేసిన భూస్వాముల వద్దే భూమి కౌలుకి తీసుకుని, ఆ భూమిని తిరిగి సాగుబడిలోకి తీసుకువచ్చి, వారికి పరిచయం, అనుభవం ఉన్న వర్షాధార వరి పంటనే నాలుగు

నెలలపాటు పండించాలనుకున్నారు. ఒక పంచాయితీ వార్డ్ మెంబరు మరియు ఒక సి.డి.ఎస్. మెంబరు యొక్క సహాయంతో వారు భూస్వాములతో ఈ షరతుల మేరకు కౌలు ఒప్పందం రాయించుకోగలిగారు. 5.5 ఎకరాలకు కౌలు అద్దె ఎకరానికి, సంవత్సరానికి రూ.12,000/-. మిగతా 8 ఎకరాలకీ కౌలు అద్దెగా వచ్చిన దిగుబడిలో 50% వాటా చెల్లించాలి. నగదు రూపంలో చెల్లించవలసిన కౌలు అద్దె కట్టడం కొద్దిగా కష్టం అయ్యింది. ఎందుకంటే, ఈ డబ్బు అడ్వాన్సుగా కట్టవలసి ఉంది కనుక రెండవ అద్దె పంట చేతికొచ్చాక కట్టడం కాబట్టి, దానికి ఇబ్బంది లేదు. ఈ మహిళలు వారి బంధువుల నుండి కొంత మొత్తం చేబదులుగానూ, కొంత మొత్తం ఎస్.హెచ్.జి. నుండి అప్పుగానూ తీసుకుని వ్యవసాయం మొదలుపెట్టారు. భూమి తయారీ మరియు భూమి పునరుద్ధరణ పనులకి ఎం.జి.ఎన్. ఆర్.ఇ.జి.ఎ. పథకం కింద ఒక అనుబంధ కార్యక్రమం కూడా రూపొందించడం జరిగింది. గ్రామ పంచాయితీవారితో మాట్లాడి, ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎ. ద్వారా లభించిన కూలి డబ్బులు, వారు తీసుకున్న ఎస్.హెచ్.జి.అప్పు, బంధువుల వద్ద తీసుకున్న చేబదులు కలిపి కౌలు అద్దె కట్టేశారు. వరి పంట పండించడంలో వీరికి అనుభవం ఉన్నప్పటికీ, వీరు వరి పంట సాగులో శిక్షణ పొందేలా సి.డి.ఎస్. ప్రోత్సహించింది. మీరు ఎందుకు శిక్షణ తీసుకుంటున్నారు అని అడిగితే, తాము ఎటువంటి చీడపీడల వలనా పంటను నష్టపోయి, అప్పులపాలయ్యే పరిస్థితి రాకుండా ఉండాలని సి.డి.ఎస్.వారు తమకు శాస్త్రీయ పద్ధతులలో పంటను నిర్వహించుకోవడంలో తర్ఫీదునిచ్చారని అన్నారు.

సమిష్టి కౌలు ఒప్పందం విధానంలో స్వతహాగా రెండు ఇబ్బందులు ఉన్నాయి. (ఎ) పంట విఫలమైనా, లేదా దిగుబడి తక్కువ వచ్చినా, ఇంక ఆ రైతు ఎప్పటికీ అప్పుల్లో కూరుకుపోవాలి. (బి) ఒక వేళ రెండు సంవత్సరాలపాటు పంట బాగా వస్తే, ఆ భూమి మంచి సారవంతంగా తయారయ్యి, ఆకర్షణీయంగా మారి, ఆ భూస్వామి మనసు మార్చుకుని తన భూమి తనకి ఇమ్మని అనచ్చు. అయితే ఈ రెండు విషయాలలోనూ రమణివాళ్ళు అదృష్టవంతులే. యే యేటికాయేడు వారి ఉత్పత్తి నిలకడగా పెరిగింది. తగినంత వర్షం పడడం వారికి మేలు చేసింది. అంతకన్నా ముఖ్యంగా వారి కౌలు ఒప్పందం మధ్యలో ఆగలేదు. అందరు భూస్వాములూ ప్రతి యేటా వారి లీజు ఒప్పందం పొడిగించుకున్నారు. వర్షాధార పద్ధతిలో పండించినప్పటికీ ఈ మహిళలు వారి పొలాలలో 1200 కిలోల దిగుబడి సాధించారు. మొత్తం దిగుబడి 15500-16500 కిలోల వరకూ వచ్చింది. ఈ లెక్కన వారి బృందానికి రూ.2,25,000/- నుండి 2,75,000/- వేల వరకూ ఆదాయం రాగా, ఒక్కో సభ్యురాలికి రూ.40,000/- నికర ఆదాయం లభించింది.

2009లో నబార్డ్ ఈ బృందాన్ని ఒక జాయింట్ లయబిలిటీ గ్రూప్ (జె.ఎల్.జి - ఉమ్మడి పూచీ సంఘం)గా నమోదుచెయ్యడంతో వారి ప్రయాణం సరికొత్త మలుపు తిరిగింది. ఈ కేటగిరీ మార్పు కె.డి.ఎస్. వారి అధికారిక విధానం మేరకు జరిగింది. ఇప్పుడు వీరు వాణిజ్య మరియు సహకార బ్యాంకుల నుండి అతి తక్కువ వడ్డీ రేటుకే వ్యవసాయ ఋణాలు తీసుకోవడానికి అర్హులు. 2011లో వీరు మరొక మైలురాయికి చేరుకున్నారు. కే.డి.ఎస్. వారి కార్యక్రమ లక్ష్యం కింద, సి.డి.ఎస్. మరియు గ్రామ పంచాయతీ వారినీ ఒక సప్లై కంపెనీతో అనుసంధానం చేసారు. ఈ ప్రభుత్వేతర మార్కెటింగ్ సహకార సంస్థ ప్రభుత్వం తరపున వీరి దగ్గర ఉత్పత్తిని కనీస మద్దతు ధర, కిలో రూ.17/- చొప్పున కొనుగోలు చేసింది. అప్పుడు అక్కడ మార్కెట్ ధర కిలో 13/- రూపాయలే.

రమణి వాళ్ళ కథ చాలా సాఫీగా సాగింది. కె.డి.ఎస్. కింద ఏర్పాటు చేయబడిన సి.డి.ఎస్. మరియు ఏ.డి.ఎస్. సంస్థలు అందించిన వెన్నుదన్ను కారణంగానే ఈ మహిళలు ఖాళీగా పడి ఉన్న భూమిని, భూస్వాముల వద్ద సరళమైన కౌలు ఒప్పందాల్తో కౌలుకు తీసుకుని సమిష్టిగా ఈ కార్యక్రమం మొదలుపెట్టడం కుదిరింది. ఏవో పరిచయంలేని కొత్త కార్యక్రమాలు మొదలుపెట్టడం కాకుండా, ఈ మహిళలు తమకు తెలిసున్న పనినే ఎంచుకున్నారు. ఎన్.ఆర్.ఇ.జి.ఎ. అందించిన తోడ్పాటు, ఎస్.హెచ్.జి. అందించిన అప్పు మొత్తంతో వారు ధైర్యం చెయ్యగా, వారు విజయం సాధించారు. ప్రధానంగా, కుటుంబంలోని శ్రమనే పెట్టుబడిగా పెట్టి, ఈ బీడు భూములను సాగుబడిలోకి తేవచ్చునని వారు నిరూపించడంతోబాటు, కుటుంబ ఆదాయాన్ని కూడా గణనీయంగా పెంచుకున్నారు. ఒక సప్లై కంపెనీతో అనుసంధానం అయ్యి ఉండడం వలన వారు ఒక రక్షిత ధర యంత్రాంగం పరిధిలో ఉండి, మార్కెటింగ్‌లో ఉండే ఒడిదుడుకులబారినుండి రక్షింపబడ్డారు.

ఈ అనుభవం ద్వారా మనం తెలుసుకోవలసిన పాఠాలు ఎన్నో ఉన్నాయి. ఈ మహిళల మీద, వారి కుటుంబాల మీద భూస్వాములు నమ్మకం కలిగి ఉండడంతో, ప్రతి యేటా వారు వీరి కౌలు ఒప్పందాలను పొడిగించారు. ఇది ఈ కార్యక్రమం విజయవంతమవ్వడానికి ముఖ్యమైన కారణం. కేరళలో కౌలు ఒప్పందాలు రద్దు చేసిన కారణంగా, ఈ రంగంలో కేవలం నోటి మాట మీద, తెల్ల కాగితాల మీద రాసుకున్న వేలకొద్దీ ఒప్పందాలు చలామణిలో ఉన్నాయి. ఇటువంటి ఏర్పాట్లు భూస్వాములకు అనుకూలంగా ఉంటాయి. భూస్వాములు కౌలు ఒప్పందం ఒప్పుకున్నవాళ్ళూ కౌలు తీసుకున్న వాళ్ళు కూడా లాభపడతారు. కౌలు అద్దె మార్కెట్ రేటు ప్రకారం కట్టాక కూడా, వారికి తెలిసి ఉన్న వరిసాగు చేపట్టడం ద్వారా ఈ మహిళలు మంచి లాభాలు ఆర్జించారు. సి.డి.ఎస్. మరియు ఏ.డి.ఎస్.ల తోడ్పాటు కేవలం

వీరికి అనువైన వాతావరణం కల్పించడం వరకే పరిమితమైంది. బ్యాక్ ఎండ్ సబ్సిడీ అందించే నిమిత్తం కొద్దిపాటి పర్యవేక్షణ అవసరమైంది. సాంకేతిక పరిజ్ఞానం బదిలీ మాత్రం చాలా తక్కువనే చెప్పాలి.

ఈ మహిళల జీవితాలలో వచ్చిన మార్పులేమిటి? వారి ప్రకారం, వ్యక్తిగతంగా వారి ఆదాయం పెరిగింది. వారు వారికున్న వ్యక్తిగత అప్పులన్నీ తీర్చేయగలిగారు. ఒక బృందంగా కూడా వీరి పొదుపు మొత్తం ఎంతగా పెరిగిందంటే వారు వారి బృందం తరఫున ఒక అర ఎకరం భూమి కూడా కొన్నారు. ఈ మహిళలు తమ ఇంటికి కావలసిన సరుకులను కొనుక్కున్నారు. కొంత బంగారం కూడా కొనుక్కోగలిగారు. ఒక్క మాటలో చెప్పాలంటే, కొద్ది కొద్దిగా అయినా, నిలకడగా వీరి ఆస్తులు పెరుగుతూ వచ్చాయి. కె.డి.ఎస్. కింద ఉన్న భూములలో అధిక మొత్తం ఇలా సాధారణ పంటలైన వరి మరియు కొద్దిపాటి కూరగాయలు, దుంపలు, పండ్లు అంతరపంటగా వేసిన అరటి పంట కిందే ఉంది. ఈ కార్యక్రమంలోని సరళత్వం మరియు మహిళా కూటములూ, పంచాయితీ రాజ్ వ్యవస్థ అందించిన పటిష్టమైన సంస్థాగత తోడ్పాటూ ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ముఖ్యకారణాలు. ◆

**Source : LANDESA,** Women Transforming Indian Agriculture, A Collection of Case Studies from Indira Kranthi Patham of Andhra Pradesh and Kudumbashree Mission of Kerala, December 2013, New Delhi.


ఆంగ్లమూలం :
లీసా ఇండియా సంపుటి 16, సంచిక 2 జూన్ 2014


## www.leisaindia.org

A website for learning and sharing experiences on LEISA practices

**Main Features**

- Space to share your LEISA experience.
- A source for LEISA practices followed by farmers.
- An archive of LEISA India magazines—English edition and regional editions (Kannada, Tamil, Hindi, Telugu, Oriya, Punjabi and Marathi)
- Photos and videos on LEISA practices.
- Interesting cases of people following LEISA practices.




Follow us on Facebook: www.facebook.com/Leisaindiamag Follow us on Twitter: @LeisaIndia

# ఘనమైన అటవీ ఆహార వైవిధ్యం

## భరత్ మన్సత

**మన భూగోళం ఒక అత్యంత కీలకమైన సంధి కాలపు అంచున ఉంది. నిర్దాక్షిణ్యంగా శిలాజ వనరులను కొల్లగొట్టిన శకం ముగిసి, మన జీవ సంపదను పునరుద్ధరించుకునే శకానికీ, వనరులను పెంచి పోషించుకునే సంస్కృతికీ దారి ఇవ్వాలి.**

దాదాపు రెండు దశాబ్దాల ముందు మేమొక రెండు డజన్ల మంది మా వనరులను కూడగట్టుకుని ఉత్తర కొంకణ ప్రాంతపు పశ్చిమ కనుమలలో సహ్యాద్రి పర్వతాల పాదాల వద్ద ఎగుడుదిగుడుగా ఉన్న భూమిని కొన్నాము. కొన్ని సంవత్సరాలు గడిచేసరికి ఆ భూమి ఒక అద్భుతమైన, దట్టమైన, ఎత్తైన వృక్షాలున్న వనంగా రూపుదిద్దుకుంది. ఎంతో జీవవైవిధ్యం గల ఈ వనం ఇప్పుడు 'వనవాడి'గా పిలువబడుతోంది. స్థానికులైన గిరిజనుల పరిజ్ఞానం మేరకు ఈ వనవాడిలోని వృక్ష సంపదను సర్వే చేయగా, అందులో 52 వృక్ష జాతులు తినడానికి పనికివచ్చేవిగా గుర్తించడం చూసి మేము ఆశ్చర్యపోయాము.

ఈ వృక్షాలు సంవత్సరంలో ఏదో ఒక కాలంలో, తినడానికి పనికివచ్చే ఆకులో, కాయలో, పువ్వులో, కాండమో, దుంపలో, వేర్లో మొదలైన సాగుచేయనటువంటి అటవీ ఆహారాన్ని అందించేవే. మా ప్రాంతంలో ఇవి అత్యధికంగా అందుబాటులో ఉండేది వర్షాకాలపు తొలిరోజుల్లోనే. సాధారణంగా ఈ సమయానికి ఆ ముందు సంవత్సరం పండిన ఆహారం అంతా నిండుకుని ఉంటుంది. మళ్ళీ కొత్త పంట వెయ్యడానికి తగిన సత్తువ ఇవ్వడానికి రైతులకు మంచి పుష్టిని కలిగించే ఆహారం అవసరం అయిన సమయంలో ఇవి అందివస్తాయన్న మాట.

వనవాడిలో జరిపిన ప్రాథమిక సర్వేలో అనేకరకాల సాంప్రదాయ ఉపయోగాలు కల 120 వృక్ష జాతులు ఉన్నట్లు తెలిసింది. ఆహారాన్ని అందించే వృక్షాలే కాకుండా ఔషధీయ ఉపయోగాలు కల వృక్ష జాతులు 45కి పైనే ఉన్నట్లు తెలుసుకున్నాము. కలపకు పనికివచ్చే వృక్షజాతులు కనీసం 20దాకా ఉండగా, అందులో నాలుగు ప్రథమ శ్రేణి కలప జాతులుగా పేరున్నవి. వీటితోబాటు అద్దకపు రంగులు, సోపులు, తినడానికి పనికివచ్చే నూనెలు, జీవ-ఇంధనాలు, జిగురు మరియు గుగ్గిలం, జీవ కీటక నాశినులు, విస్తరాకులు అందించే వృక్ష జాతులు ఉన్నాయి. అంతేకాక, పశువుల మేత, వంట చెరకు, నార, ఎరువు, కంచె, చేతిపనులు వంటి వాటికి పనికివచ్చే వృక్షాలు కూడా ఉన్నాయి.



*గిరిజన ఉత్సవంలో ప్రదర్శనకు ఉంచిన అటవీ ఆహారాన్ని పరిశీలిస్తున్న సందర్శకులు*

అనేక వృక్ష జాతులకు బహుళ ఉపయోగాలు ఉంటాయి. ఉదాహరణకి విప్ప చెట్టు ఆకులు పశువులకు మేతగా ఉపయోగపడతాయి. విప్ప పూలతో బెల్లం, సారా, లేదా అంబలి చేస్తారు. కాయలను కూరగా వండుకోవచ్చు. గింజల నుండి వంట నూనె తీస్తారు. విప్ప గింజల నూనె మార్కెట్లో దొరికే ఏ ఇతర నూనెల కన్నా కూడా బలవర్ధకమైనది. నూనె తీయగా మిగిలిన చెక్క పంట పొలాలకు ఎంతో విలువైన ఎరువుగా ఉపయోగపడుతుంది. విప్ప చెట్టు కలప బళ్ళు, కర్ర సామాను, ఆట సామాన్లు, సంగీత వాయిద్యాలు, వ్యవసాయ పనిముట్ల తయారీకీ, ఇల్లు మరియు పడవల నిర్మాణానికి పనికి వస్తుంది.

ఉచితంగా జీవావరణహితమై, అంటే బయటి నుండి ఏవిధమైన శక్తి కానీ, నీరూ, ఎరువులూ కానీ అందించక్కరలేకుండా లభిస్తున్న ఈ సేంద్రీయ పౌష్టిక ఆహారాలను మన ఆధునిక ఆర్థిక వ్యవస్థ అస్సలు పట్టించుకోకపోవడం చాలా దురదృష్టకరం. వాస్తవానికి, సారశక్తిని పట్టి ఉంచడానికీ, కర్బనాన్ని జప్తుచెయ్యడానికీ, వాతావరణ మార్పును నివారించడానికీ నేలను పరిరక్షించి, పునరుద్ధరించడానికీ, భూసారాన్ని తిరిగి నింపడానికీ, జీవవైవిధ్యాన్ని వృద్ధిచెయ్యడానికీ భూగర్భ జలాలను పెంచుకోవడానికీ అడవుల కన్నా సమర్థవంతమైన సాధనాలు ఏముంటాయి. తినడానికి పనికి వచ్చే వృక్ష జాతులు భూమి



*గిరిజనులు ప్రదర్శనకు ఉంచిన అనేకరకాల అటవీ ఆహారాలు*

మీద 80,000 వరకూ ఉన్నట్లు 'గైయా అట్లాస్ ఆఫ్ ప్లానెట్ మేనేజ్‌మెంట్' పేర్కొంది. కానీ కేవలం 150 మొక్కలే అనాదిగా ఆహారపంటలుగా పండించడం జరుగుతోంది. అయితే పారిశ్రామిక పద్ధతిలో పండించే ఏక పంట విధానాలు అమలులోకి వచ్చేసరికి ఈ సంఖ్య 20కి పడిపోయింది. మొత్తం మానవుల ఆహారంలో 90% కేవలం ఈ 20 మొక్కలే అందిస్తున్నాయి. మొత్తం మానవులకు అందే ఆహారంలో నాలుగింట మూడవ వంతు ఒక ఎనిమిది పంటల నుండే వస్తోంది. ప్రకృతి మనకు ప్రసాదించిన తినడానికి యోగ్యమైన వృక్ష సంపదలో ఇది 0.01%, అంటే 10 వేలలో ఒక వంతు. దీనిని బట్టి చూస్తే, అందమైన రంగురంగుల ప్యాకెట్లలో వినియోగదారులకు విక్రయిస్తున్న మల్టీ-బ్రాండ్ ఉత్పత్తులను ప్రోత్సహించే ఆర్థిక వ్యవస్థలో మనం నిజంగా ఎదుగుతున్నామా లేదా మరింత లేనివాళ్ళం అవుతున్నామా?

ఫిబ్రవరి 2014లో, అదృష్టవశాత్తూ నేను ఒక ఉత్సాహవంతమైన గిరిజన ఆహార ఉత్సవానికి వెళ్ళడం జరిగింది. ఒడిస్సా రాష్ట్రంలోని నియంగిరి పర్వతాల నడుమ కటక్ దగ్గర బిస్సం అనే చోట జరిగిన తూర్పు, మధ్యభారతానికి చెందిన వివిధ రాష్ట్రాలలోని 200లకుపైగా గిరిజన గ్రామాల నుండి, 600కు పైగా ఆదివాసీలు, అందులో 80% వరకూ మహిళలు, వారి యొక్క సాంప్రదాయ ఆహారాల యొక్క ఉన్నతమైన వైవిధ్యాన్ని చాటిచెప్పడానికి, ఈ ఆహార పండుగలో ఒకచోట కూడారు.

1500 ఆహార పదార్థాలు - సాగుచేసినవీ మరియు సాగుచేయనటువంటివీ, పచ్చివీ మరియూ వండినవీ - ప్రదర్శనలో ఉంచారు. వీటిలో సాగుచేయనటువంటి అటవీ ఆహారాలు 900! తినడానికి సిద్ధంగా ఉన్న 400 వంటకాలు కూడా రుచిచూడడం కోసం ఈ ప్రదర్శనలో ఉంచారు.

1500 ఆహార పదార్థాలు - సాగుచేసినవీ మరియు సాగుచేయనటువంటివీ, పచ్చివీ మరియూ వండినవీ - ప్రదర్శనలో ఉంచారు. వీటిలో సాగుచేయనటువంటి అటవీ ఆహారాలు 900!

పహరీ కోర్బా తెగకు చెందిన ఆదివాసీ ఒకరు, ఈ విధంగా అన్నారు. ''మా పహరీ కోర్బాలు అనాదిగా, ఎటువంటి జబ్బులూ, అనారోగ్య సమస్యలూ లేకుండా ఆరోగ్యవంతమైన, దీర్ఘమైన, జీవితాన్ని గడుపుతున్నారు. ఏ చిన్న రోగమొచ్చినా, ఇబ్బంది వచ్చినా, దాన్ని నయం చేసుకోవడానికి మేము అడవిలోని మొక్కల మీదే ఆధారపడతాము కానీ మేము ఎప్పుడూ ఆసుపత్రికి వెళ్ళడం, మందు బిళ్ళలూ, సూది మందులూ తీసుకోవడం చెయ్యలేదు!''

అనిశ్చిత వర్షపాతం, వర్షాభావ పరిస్థితుల వలన వ్యవసాయ పంట చేతికందనపుడూ కరువు పరిస్థితులు నెలకొన్నప్పుడూ సాగుచెయ్యనటువంటి అటవీ ఆహారాలు, పౌష్టికాహారాన్ని అందించే విషయంలో తమను ఎంతగా ఆదుకున్నాయో అన్నది అక్కడ చేరిన గిరిజనులు చెప్పారు.

కానీ చాలా ప్రదేశాలలో, అనేక బయటి కారణాల వలన ఈ సాగుచేయనటువంటి ఆహారాల లభ్యత, వినియోగం కూడా తరిగిపోతున్నాయని వారు చెప్పారు. అటవీ నిర్మూలన, నిర్వాసన, నగరీకరణ పెద్ద పెద్ద ఆనకట్టలు, గనుల తవ్వకం, భారీ పరిశ్రమలు, వాణిజ్య పంటలు మరియు ఏక పంటలు విస్తరణ - ఇవన్నీ కలిసి కొన్ని వేల సంవత్సరాలుగా వస్తూ ఉన్న మా సాగుచేయనటువంటి ఆహారాల యొక్క జైవిక మరియు సామాజిక నెలవులను అదేపనిగా దెబ్బతీస్తున్నాయి.

వారసత్వంగా వస్తున్న ఈ సుసంపన్నమైన అటవీ సంపద తరతరాలుగా మమ్మల్ని పోషిస్తూ ఉంది. ఈ రోజున, గందరగోళంలో ఉన్న ఇప్పటి 'మిలినియం/సహస్రాబ్ది' తరానికి అడవులతో సామరస్యంగా, సహజీవనం చేసే నేర్పూ, ఓర్పూ నేర్పగలవారు ఎవరైనా ఉన్నారంటే, అది ఒక్క ఈ గిరిజనులు మాత్రమే. వారిలో కూడా కేవలం ఆ పరిజ్ఞానం, నైపుణ్యం మరియు ఆ దేశీయ సాంస్కృతిక దృక్పథం కలిగి ఉన్నవారు మాత్రమే అందుకు సమర్థులు. ◆

**Bharat Mansata**
Earthcare Books,
10 Middleton Street, Kolkata 700 071
Email : bharatmansata@yahoo.com

ఆంగ్లమూలం :
లీసా ఇండియా సంపుటి 16, సంచిక 1 డిసెంబర్ 2014

# హద్దులుదాటి ముందుకు వెళ్ళడం

ఆనీ బెర్గ్ మాన్

**భారతదేశపు వాయవ్య ప్రాంతంలోని మహిళలు ఒక కూటమిగా ఏర్పడి తమని, తమ కుమార్తెలను దారిద్ర్యం నుండి కాపాడుకుంటున్నారు. వారి మీద వారికి నమ్మకం కుదరడంతో ఇప్పుడు వారు వారి తోటి మహిళలకు కూడా దారి చూపించడానికి సిద్ధంగా ఉన్నారు.**

భారతదేశపు వాయవ్య ప్రాంతమైన రాజస్థాన్ రాష్ట్రంలోని ఆల్వార్ జిల్లాలో ఆంకా అనే గ్రామం ఉంది. 3 మిలియన్ల జనాభా ఉన్న ఈ జిల్లాలో ఉన్నవి దాదాపు అన్నీ నిరుపేద కుటుంబాలే. వీరిలో చాలామంది దారిద్ర్యంతో పోరాడుతున్నవారే. ఇంక మహిళల సంగతి అయితే మరీ దుర్భరం.

ఆల్వార్‌లో చాలా ప్రాంతాలలో ఆడపిల్లలకి 13 సంవత్సరాల వయస్సు వచ్చేసరికి పెళ్ళి చేసేస్తారు. కూతుర్ల కన్నా కొడుకులకే ఎక్కువ విలువ ఇస్తారు. అసలు ఎక్కడో కానీ కూతుర్లకు చదువుకునే అవకాశం ఇవ్వరు. చదువూ లేక, ఏ కొద్దిపాటి తోడ్పాటు కానీ, ప్రేమ కానీ లభించని ఈ ఆడపిల్లలు పెద్దయ్యాక ఆత్మన్యూనతా భావం, మరియు వారి కుటుంబంలోను, సమాజంలోనూ తక్కువ హోదా కలిగిఉండడంలో ఆశ్చర్యం ఏముంది.

కానీ ఇప్పుడు, హైఫర్ ఇంటర్నేషనల్ అన్న సంస్థ ఈ మహిళల యొక్క ఆత్మస్థైర్యాన్ని పెంచే దిశలో కృషి చేస్తోంది. ఇప్పుడు వీరు విద్యావంతులై తమ గురించి తాము తెలుసుకుని, ప్రపంచాన్ని ఎదుర్కోవడానికి సిద్ధం అవుతున్నారు.

## ప్రారంభం

స్థానిక ప్రభుత్వేతర సంస్థ మరియు హైఫర్ ఇండియా సంస్థ యొక్క భాగస్వామ్య సంస్థ అయిన 'ఇబటడా' సంస్థలకు చెందిన ఇద్దరు కార్యకర్తలు ఆంకా లోని మహిళలు ఒక బృందంగా ఏర్పడే విధంగా ప్రోత్సహించారు.

'ఇబటడా' అంటే ఉర్దూ భాషలో ''ప్రారంభం'' అని అర్థం. హైఫర్ ఇండియా సంస్థ లాగే, స్థానిక సమూహాలను బలపరచడం అన్నది ఇబటడా సంస్థ యొక్క ప్రధాన లక్ష్యం. ఈ సంస్థకు మహిళల శ్రేయస్సే ప్రధానాంశం. హైఫర్ ఇండియా మరియు ఇబటడా సంస్థలు కలిసి ఆంకా గ్రామంలో చేపట్టిన కార్యక్రమం ఏమిటంటే, ఒక 10-15 మంది మహిళలు ఒక బృందంగా ఏర్పడి వారి వారి కుటుంబ సభ్యుల అనుమతితో, వరుసగా కొన్ని శిక్షణా కార్యక్రమాలలో పాల్గొనేటట్లు చేయడం.



మేకల పెంపకం చేపట్టడం ద్వారా మెహ్రూన్నిసా తన ఆదాయాన్నీ, ఆత్మ విశ్వాసాన్నీ కూడా పెంచుకున్నారు

ఈ మహిళలు ఆ శిక్షణాకార్యక్రమాలలో సుస్థిరాభివృద్ధికి హైఫర్ సంస్థ సూచించిన 12 మూల సూత్రాలు, పశువుల పెంపకం, లింగ సమాన న్యాయం (జెండర్ ఈక్విటీ) మొదలైన అంశాల గురించి తెలుసుకుంటారు. వీరికి బ్యాంకు సేవలు అంతగా అందుబాటులో ఉండవు కాబట్టి ఈ స్వయంసహాయక బృందాలు ప్రధానంగా పొదుపు మరియు పరపతి-ఆధారిత బృందాలుగా పనిచేస్తాయి.

ఈ పొదుపు సంఘాల వలన మహిళలలో కొంత భద్రతా భావం ఏర్పడుతుంది. వారి సొంత డబ్బులతోనే వారి బృందాలను సుస్థిరంగా చేసుకోగలరు. తద్వారా వారి మీద వారికి నమ్మకం కుదురుతుంది. ఈ పొదుపు మరియు పరపతి సంఘాలను విజయవంతంగా నిర్వహించుకున్న తరువాత, వారి జీవనోపాధిని మరింతగా మెరుగుపరచుకునేందుకు వారికి పశువులు ఇప్పించడం జరిగింది.

## స్ఫూర్తిని కలిగించే మెహ్రూన్నీసా ఉదంతం

29 సంవత్సరాల మెహ్రూన్నీసాకి ఎన్నో బాధ్యతలు. తన ముగ్గురు పిల్లలను, భర్తను, అత్త మామలను, మరిదిని చూసుకోవడంతో పాటు వారి గేదెను, గోధుమపంటను కూడా కనిపెట్టుకుని

ఉండాలి. ఇంటిలోని అన్ని పనులూ ఆమే చేసుకోవాలి. తన స్థానం, విలువ కేవలం ఇంటికే పరిమితం అని వాయవ్య భారతంలోని అనేకమంది ఇతర గ్రామీణ మహిళలలాగే తానూ అనుకుంది.

అందువలన, తమ గ్రామంలో కొంతమంది మహిళలు కలిసి, వారి భవిష్య అవసరాలకై డబ్బు కూడబెట్టి, దాచుకోవలసి వచ్చినప్పుడు, మెహరున్నీసా కొంత జంకింది. ఇలా కూటమిగా ఏర్పడి పొదుపు చెయ్యడం అంటే, తాను తన భర్త దగ్గర చెయ్యి దాచి డబ్బులు అడిగి, ఆ డబ్బును తనకు బొత్తిగా పరిచయంలేని మహిళలకు అప్పచెప్పడమే.

''నాకు నమ్మకం కుదరలేదు,'' అంది మెహరున్నీసా. కానీ అంతకన్నా ముఖ్యమైన విషయం ఏమిటంటే ఆమె భర్తకి ఇటువంటి కార్యక్రమాలపై విశ్వాసం లేకపోవడం. ''మనం ఏమీ దాచుకోనక్కర్లేదులే'', అని తన భర్త అన్నాడని మెహరున్నీసా చెప్పింది.

పదమూడుమంది సభ్యులు గల స్వయం-సహాయక బృందం లో సభ్యురాలిగా చేరింది మెహ్రున్నీసా. ప్రతి ఒక్కరూ నెలకి రూ.10 చొప్పున కూడబెట్టేవారు. ఒక సంవత్సరం తరువాత, అది రూ.50కి పెరిగింది.

దాదాపు, పొదుపు కార్యక్రమం మొదలుపెట్టగానే, ఈ సంఘం తమ బృందంలోని మహిళలకు డబ్బు అప్పుగా ఇవ్వడం మొదలుపెట్టింది. ఈ సంఘం అప్పులు ఇవ్వడం మొదలుపెట్టిన కొద్దికాలానికి, మెహ్రున్నీసా ఒక 10,000 రూపాయల అప్పు తీసుకుంది. గతంలో వారి కుటుంబం ఒక వడ్డీ వ్యాపారి వద్ద, అధిక వడ్డీకి అప్పు తీసుకుని ఉంది. ఇప్పుడు ఈ స్వయం-సహాయక సంఘం నుండి తీసుకున్న డబ్బుతో వారి పాత అప్పు తీర్చడం జరిగింది. ఇలా వారి జీవితాలలో ఒక చిన్న భాగం అయినా తమ చేతిలోకి తీసుకోగలగడం చాలా ప్రోత్సాహకరంగా ఉందనీ, తమకు సాధికారత చేకూర్చే విధంగా ఉందనీ మెహ్రున్నీసా అంది.

మెహ్రున్నీసా సభ్యత్వం తీసుకున్న గణేశ్ మహిళా సంఘం జనవరి, 2010లో కొన్ని గొర్రెలను తెచ్చుకుని, వాటి పెంపకం ద్వారా ఆదాయం పొందే దిశలో ఆలోచనలను సాగించారు. ''ఆడవాళ్లు ఇంట్లోనే ఉంటూ, అదనపు ఆదాయంతో కుటుంబానికి తోడ్పడే అవకాశం ఉన్నందున, గొర్రెల పెంపకాన్ని తాము సంతోషంగా చేపట్టామని మెహ్రున్నీసా అన్నారు.

> రెండు సంవత్సరాలు కలిసి పనిచేసేసరికి వీరి మధ్య బంధం బలపడింది. ఈ మహిళల యొక్క ఆత్మవిశ్వాసం మరియు ఆత్మగౌరవం పెరిగాయి.

హైఫర్ సంస్థ భారతదేశంలో ఎంతోకాలంగా పనిచేస్తోంది. 1955వ సంవత్సరంలో మొట్టమొదట 20 జెర్సీ ఆవులను భారత వ్యవసాయ మంత్రిత్వ శాఖకు పంపించడం జరిగింది. అప్పటి నుండి హైఫర్ సంస్థ భారత దేశంలో వివిధ హోదాలలో పనిచేసినా, ఇక్కడ తమ కార్యక్రమాలను నిరంతరాయంగా కొనసాగించడానికి 1922 సంవత్సరంలో ఒక రిజిస్టర్డ్ ట్రస్టును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలు ఎక్కువగా దక్షిణాది రాష్ట్రాలలో చేపట్టడం జరిగినా కొన్ని ప్రాజెక్టులు రాజస్థాన్ మరియు ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాలలో కూడా నిర్వహించబడ్డాయి.

అమలుజరుగుతున్న కార్యక్రమాలు హైఫర్ మోడల్ నుండి కొంత పక్కదారి పట్టడంతో 2003లో హైఫర్ సంస్థ ఆ కార్యక్రమాలకు తమ తోడ్పాటును ఉపసంహరించుకుంది. అయితే రెండు సంవత్సరాల తరువాత, ఆసియా సునామీ దక్షిణ తీర ప్రాంతంలో భీభత్సం సృష్టించినప్పుడు, ఆ ప్రాంతంలో పునరావాస కార్యక్రమాలకి సహకారం అందించడం మొదలుపెట్టింది. రాజస్థాన్ రాష్ట్రంలో కూడా భాగస్వామ్య సంస్థలతో కలిసి ప్రాజెక్టులను ప్రారంభించింది. 2008లో, ప్రతినిధి కార్యాలయంగా గుర్తింపు పొంది, మరొకసారి తన కార్యక్రమాలను ముమ్మరం చేసింది.

## పెరుగుతున్న సంఖ్య, పెరిగిన ఆత్మ విశ్వాసం

హైఫర్ ఇండియా మరియు ఇబటడ సంస్థతో కలిసి పనిచెయ్యడం మొదలుపెట్టాక ఏర్పడిన 16 మహిళా స్వయం-సహాయక బృందాలలో, మెహరున్నీసా మరియు మరొక 22 ఇతర మహిళలు చేరిన గణేశ్ మహిళా సంఘం ఒకటి. ఈ 16 బృందాలు తాము సముపార్జించిన జ్ఞానాన్ని, పెంచిన మేకలను మరొక 22 స్వయం-సహాయక బృందాలకు 'పాస్ ఆన్ ది గిఫ్ట్', అంటే తిరిగి బహుమతిగా వేరేవాళ్ళకి ఇచ్చే పద్ధతి మీద అందించారు. హైఫర్ మరియు ఇబటడ సంస్థలు ఇప్పటికి 491 కుటుంబాలకు, 1,350 మేకలను అందించాయి.

మెహ్రున్నీసా వాళ్ళ బృందం ఏర్పడి దాదాపు రెండు సంవత్సరాలు కావొచ్చింది. ఈ మహిళలు, వారి భర్తలు మరియు వారి కుటుంబాల మధ్య సంబంధబాంధవ్యాలు బలపడ్డాయి. వారు కూడా మెల్లమెల్లగా ఈ బృందం యొక్క యోగ్యతను గుర్తించారు. వీరి కార్యక్రమాలు ముందుకు కొనసాగడంతోబాటుగా ఈ మహిళల యొక్క ఆత్మ విశ్వాసం మరియు ఆత్మగౌరవం కూడా పెరిగాయి. ఉదాహరణకి, మెహ్రున్నీసా, ఇప్పుడు ఈ కార్యక్రమం ద్వారా తాను నేర్చుకున్న విషయాలతో ఇంటి బయట కూడా పనిచెయ్యగలను అని తెలుసుకుంది. అంతేకాదు, ఆమె తన



*ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి, ఒకరికి ఒకరు తోడ్పాటునందించుకోవడానికి ఎస్.హెచ్.జి. సమావేశాలు వేదికగా ఉంటాయి*

ఇద్దరు కూతుర్ల యొక్క భవిష్యత్తు గురించి కూడా ఆలోచిస్తోంది. నేను ఎంతో ఆలోచిస్తున్నాను. మరెన్నో ప్రణాళికలు వేసుకుంటున్నాను. మా పిల్లలని మంచి పాఠశాలలో చదివించాలి అనుకుంటున్నాను. నేను మా బృందం యొక్క ఉన్నతికై కృషి చేస్తున్నాను అంటారు మెహ్రున్నీసా. ''మేము మా సంఘాన్ని మరింతగా వృద్ధిచేసి, మరిన్ని బృందాలు తయారుచేసి, మాకు లభించిన అవకాశాన్ని మరికొంతమంది మహిళలకు అందించాలనుకుంటున్నాము''.

హైఫర్ ఇండియా సంస్థ ప్రస్తుతం భారతదేశంలో నాలుగు రాష్ట్రాలలో - బీహార్, ఒరిస్సా, రాజస్థాన్ మరియు తమిళనాడు రాష్ట్రాలలో పనిచేస్తోంది. ఈ సంస్థ చేపట్టే కార్యక్రమాలలో మేకల పెంపకం, కోళ్ళ పెంపకంతోబాటు పండ్ల మొక్కలు నాటించడం, పెరటితోటల పెంపకానికి విత్తనాలు అందించడం వంటి కార్యక్రమాలు కూడా చోటుచేసుకుంటాయి. ◆

**Annie Bergman**
Global Communications Manager, Heifer International
1 World Avenue, Little Rock, AR 72202
Email : annie.bergman@heifer.org

ఆంగ్లమూలం :
లీసా ఇండియా సంపుటి 16, సంచిక 2 జూన్ 2014